

దివ్యాంగులకు వాహనాలు సమకూర్చిన సిద్ధరామయ్య, లక్ష్మీ హెబ్బాళ్కర్

మానవత్వమే జీవనపథం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : చట్టాన్ని కాపాడేందుకు న్యాయస్థానాలు ఉన్నా.. వాటికన్నా పెద్ద న్యాయస్థానం 'ఆత్మ'నేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివరించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇక్కడి రవీంద్ర కళాక్షేత్రలో స్త్రీ-శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. 'పుట్టాక చావు తప్పదు. మరణించేలోగా ఏమి సాధించామన్న ఆత్మవిమర్శ చేసుకోవాలి. మనం మనుషులుగా.. మానవత్వంతో జీవిస్తున్నామా? అనేదీ ప్రశ్నించుకోవాలి. వైజ్ఞానికంగా జీవించడం అలవాటు చేసుకోవడమూ అవసరమే. మనమంతా విశ్వ మానవులుగా అవతరించాలన్న మహాకవి కువెంపు కలలు నిజం చేయాలి' అని పిలుపునిచ్చారు. కన్నబిడ్డల ఆదరణ కరవై వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 53 లక్షల మంది వృద్ధులకు పింఛను అందిస్తున్నట్లు తెలిపారు. వారికి అందించే మొత్తం పెంచాలనే డిమాండు పరిశీలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ రంగాల ప్రముఖులను సత్కరించి, పురస్కారాలు అందించిన సిద్ధు తదితరులు

నీ బాధ నాది కాదా..

- సిద్ధుకు పార్వతి రక్షణ హస్తం
- 'ముడా' పర్వంలో భావోద్వేగాలు
- ఇది చాలా ఆలస్యమన్న విపక్షం

ఈనాడు, బెంగళూరు : రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాల కేసు భావోద్వేగ ఘట్టానికి చేరుకుంది. ఈ కేసులో కేంద్ర బిందువైన ముఖ్యమంత్రి సతీమణి పార్వతి సోమవారం సాయంత్రం తీసుకున్న ఓ నిర్ణయం ఈ కేసును మరో మలుపు తిప్పింది. ఆ నిర్ణయం ఈ కేసును ఏ వైపునకు మళ్లిస్తుందో తెలియాలంటే మరిన్ని రోజులు వేచి చూడాల్సి ఉన్నా.. ప్రస్తుతం అధికార, విపక్షాల పరస్పర ఆరోపణలకు ఓ అస్త్రంగా మారింది. జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు వేదికగా మారిన ముడా కేసు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా డిమాండ్ల మధ్యలో వివాదాస్పద స్థలాలను తిరిగి ఇవ్వటమనే సందర్భాన్ని ఎవరూ ఊహించనది. చివరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ.. నాతో చర్చించకుండానే భార్య ఈ స్థలాలు ఇచ్చిందంటూ వ్యాఖ్యానించారు.

ఆ నిర్ణయం ఘనమే..



బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) కేటాయించిన ఇళ్ల స్థలాలను వెనక్కి ఇవ్వడంతో కొంత జాప్యమైనా.. ఉత్తమ నిర్ణయమేనని హోంమంత్రి డాక్టర్ పరమేశ్వర్ విశ్లేషించారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య 14 ఇళ్ల స్థలాలను వెనక్కి ఇవ్వడం మంచిదన్నారు. పార్టీ అధిష్ఠానం సిద్ధుకు వెన్నుదన్నుగా నిలిచినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారని గుర్తు చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల సాయంతో సిద్ధరామయ్యను వేధింపులకు గురి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు.

మలుపు తిరిగిన కేసు

ఓ వైపు లోకాయుక్త పోలీసులు కోర్టు సూచన మేరకు కేసు నమోదు చేసుకుని సోమవారం నుంచే తమ పనులు ప్రారంభించారు. మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ నేతృత్వంలోని బృందం ఒకటి బెంగళూరు లోకాయుక్త ప్రధాన కార్యాలయానికి ముడా కేసు కీలక పత్రాలను తరలించగా మరొక బృందం కెసరె గ్రామానికి చేరుకుంది. 1992లో భూసేకరణ కోసం ముడా వేసిన నోటిఫికేషన్ ప్రతులతో ముఖ్యమంత్రి బావమరిది మల్లికార్జున స్వామి కొనుగోలు చేశారన్న సర్వే నంబరు 464లోని 3.16 ఎకరాల స్థలాల కొలతలు తీసుకున్నారు. ఈ స్థలాల పరిశీలన కోసం ఫిర్యాదుదారుడు స్నేహమయి కృష్ణను రప్పించి ఆయన నుంచి మరిన్ని దాఖలాలు సేకరించారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే మరోవైపు ఈడీ కూడా ఈ వివాదంలో నగదు బదిలీ అక్రమాల నిగ్గు తేల్చేందుకు కేసు నమోదు చేసుకుంది. రేపో మాపో ఈ కేసు తాలూకా నోటీసులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుటుంబ సభ్యులకు అందుతాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈడీ నుంచి తమకు ఎలాంటి సూచన రాలేదని ముడా అధికారులు చెప్పటం గమనార్హం. ఈ దశలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి తీసుకున్న నిర్ణయం సర్వత్రా ఆసక్తిని రేకెత్తించింది. తన కుమారులు, మాజీ ఎమ్మెల్యే యతీంద్ర సిద్ధరామయ్య సోమవారం సాయంత్రం వివాదాస్పద స్థలాలను తిరిగి ఇస్తానని తల్లి పార్వతి రాసిన లేఖను ముడా కార్యాలయానికి అందించటంతో ఈ కేసు కొత్తమలుపు తిరిగింది.

రక్షణ దొరికేనా?

'భర్తతోనే కాదు కుటుంబ సభ్యులెవరితోనూ కనీస చర్చలు లేకుండా వివాదంగా మారిన ముడా స్థలాలను తిరిగి ఇస్తున్నాను. ప్రజాభిమానం మెండుగా ఉన్న తన భర్త రాజకీయ ప్రయాణానికి ఈ స్థలాలు మాయని మచ్చను మిగిల్చాయని తెలిసి వాటిని తిరిగి ఇవ్వాలని నిర్ణయించుకున్నా'నని సిద్ధరామయ్య అర్ధాంగి తీసుకున్న ఈ నిర్ణయం భావోద్వేగ ఘట్టానికి తెరలేపింది. గవర్నర్ నుంచి ఆదేశాలు, ఆపై కోర్టులో సుదీర్ఘ కాలం పాటు వాదనలు, తీర్పులు, లోకాయుక్త కేసులు, ఈడీ రంగ ప్రవేశం.. ఇంత ప్రహసనాన్ని ముగించుకుని దర్యాప్తు దశకు చేరుకున్న సమయంలో ఆ స్థలాలు తిరిగి ఇస్తే ఏం లాభమన్న ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతోంది. కోర్టు ఆదేశించినట్లు మూడు నెలల్లో ఈ కేసు పూర్తి నివేదికను అందించాలన్న ఆదేశాన్ని తుచ తప్పకుండా పాటించాల్సిందే. వివాదాస్పద స్థలాలు తిరిగి ఇచ్చినంత మాత్రాన కేసు ఉన్నపళంగా కొట్టి వేయటం సాధ్యపడని అంశం. మరోవైపు ఈడీ సైతం 1992లో ఈ స్థలాల పంపిణీలో 1992 నోటిఫికేషన్ మొదలైనప్పటి నుంచీ కొనసాగిన లావాదేవీలను బయటకు తీసే అవకాశముంది.

విపక్షాలకు అస్త్రం

విపక్షాల రాజకీయ కుట్రతో మనోవేదనకు గురైన నా భార్య ఇలాంటి నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. మరోవైపు విపక్ష నేతలు ముఖ్యమంత్రి భార్య తీసుకున్న నిర్ణయంతో తాము చేసిన తప్పు బహిరంగంగా అంగీకరించినట్లేనంటున్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర, ఎంపీ బసవరాజ బొమ్మై, కేంద్రమంత్రి కుమారస్వామి తదితరులు ఇప్పటికే ఆలస్యమైంది. ఈ ఆరోపణలు వచ్చిన రోజే ఈ నిర్ణయం తీసుకోవాల్సిందని వీరంతా వ్యాఖ్యానించారు. పైగా మేము ఎలాంటి అక్రమాలకూ పాల్పడలేదని గవర్నర్ ఆదేశాలతో పాటు కోర్టు తీర్పులను సవాలు చేసిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఆ అక్రమాలకు కేంద్రమైన స్థలాలు ఇచ్చేసి.. పరోక్షంగా నేరాన్ని అంగీకరించారు. ఇప్పటికైనా రాజీనామా చేసి గవర్నర్‌కు క్షమాపణలు చెప్పాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ దశలో ముఖ్యమంత్రి భార్య ప్రయోగించిన భావోద్వేగ కార్డు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చలేదని భాజపా నేతలు ఎద్దేవా చేస్తున్నారు. రాజకీయ ఆరోపణలు ఏమాత్రం పట్టించుకోని ముడా అధికారులు తమకు వచ్చిన మనవిపత్రాన్ని స్వీకరించి- వాటి సేల్‌డీడ్ రద్దు చేసి.. సంస్థకు సొంతం చేసుకున్నట్లు మంగళవారం రాత్రి విశ్వసనీయ సమాచారం అందింది.



బెంగళూరులో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో సిద్ధరామయ్య



సిద్ధు సతీమణి.. పార్వతి

రాజీనామాకు మొండితనమేల?

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మొండితనాన్ని వీడి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని సిద్ధరామయ్యకు భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర హితవు పలికారు. తన నేరం నుంచి తప్పించుకునేందుకు మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) నుంచి తీసుకున్న 14 ఇంటి స్థలాలను వెనక్కు ఇచ్చేస్తే చేసిన నేరం మాఫీ అవుతుందా అని ప్రశ్నించారు. పార్టీ నాయకులతో కలిసి భాజపా ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్'లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముడాలో అక్రమాలను బయటపెట్టి శాసనసభలో ధర్నాకు దిగినప్పుడు, సమావేశాలను మధ్యలోనే వదిలి సీఎం పరారయ్యారని ఎద్దేవా చేశారు. జనతాదళ్‌తో కలిసి బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర చేయడం ద్వారా ప్రజలకు కూడా సిద్ధరామయ్య చట్టాన్ని అతిక్రమించి, ఇళ్ల స్థలాలను పొందారని అర్థమైందని చెప్పారు. ఇళ్ల స్థలాలను వెనక్కు ఇచ్చేసినా కోర్టు, ఈడీ విచారణను ఎదుర్కొనక తప్పదన్నారు. సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర, భార్య పార్వతి ముగ్గురూ విచారణ ఎదుర్కోనడం తప్పనిసరని స్పష్టం చేశారు. ఆయన ఆడుతున్న రాజకీయ నాటకాలను ప్రజలు గుర్తించారని వ్యాఖ్యానించారు.



పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న విజయేంద్ర

ఆయన తప్పు చేయరు..

మైసూరు, న్యూస్‌టుడే : విపక్షాల ఆరోపణలు, లోకాయుక్త పోలీసుల దర్యాప్తునకు బాధ్యత వహించి సిద్ధరామయ్య ముఖ్యమంత్రి స్థానానికి రాజీనామా చేయవలసిన అవసరం లేదని ఆయన సోదరుడు సిద్ధేగౌడ పేర్కొన్నారు. సిద్ధరామనహుండి గ్రామంలో తనను కలుసుకున్న విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. తన సోదరుడు తప్పు చేసి ఉండడని ధీమా వ్యక్తం చేశారు. ఆయనపై వచ్చిన ఆరోపణల నుంచి బయటపడతారన్న నమ్మకం ఉందన్నారు. ఒక వేళ నేరం చేసి ఉంటే.. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోవడం సాధ్యం కాదన్నారు. పార్వతికి పసుపు-కుంకుమ రూపంలో ఆమె సోదరుడు భూమి ఇచ్చిన విషయం తనకు తెలియదని చెప్పారు.

ఒత్తిళ్లతోనే వెనక్కు...

శివమొగ్గ, న్యూస్‌టుడే : ముడాలో అక్రమాలు జరిగాయని, సిద్ధరామయ్య తనకు కావలసిన చోట ఇంటి స్థలాలను ఇప్పించుకున్నారని విపక్షాలు ఆరోపణలు చేయడం సరి కాదని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప పేర్కొన్నారు. భర్తకు చెడ్డపేరు రాకూడదని భార్య తనకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెనక్కు తిరిగి ఇచ్చినా.. విపక్షాలు ఆరోపణలు కొనసాగించడం దురదృష్టకరమని అన్నారు. శివమొగ్గలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్వీట్లు చేయడంలో విపక్ష నాయకులు ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. తమపై ఉన్న ఆరోపణలపై విచారణ ప్రారంభమైతే.. వారు ఇంతకన్నా ఎక్కువ సమస్యలను ఎదుర్కొనవలసి ఉంటుందని జోస్యం చెప్పారు.

ఆమే.. స్వయంగా వచ్చారు

మైసూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి, ఆమె కుమారుడు డాక్టర్ యతీంద్ర ఇద్దరూ తమ కార్యాలయానికి వచ్చారని ముడా కమిషనర్ రఘునందన్ తెలిపారు. తమకు ముడా కేటాయించిన 14 ఇంటి స్థలాలను వెనక్కు తిరిగి ఇచ్చేస్తున్నట్లు పత్రాన్ని ఇచ్చి వెళ్లారని చెప్పారు. ఒకసారి కేటాయించిన స్థలాలను వెనక్కు తీసుకునే విషయంలో న్యాయ కోవిదుల నుంచి సలహా తీసుకోవలసి ఉందన్నారు.

లేఖ రాసిన భాజపా..

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ముడాలో జరిగిన అక్రమాలు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై గవర్నర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు భద్రత కల్పించాలని భాజపా డిమాండ్ చేసింది. కృష్ణకు ప్రాణహాని ఉందని, ఇప్పటికే బెదిరింపులు వస్తున్నాయని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ కల్పించాలని కోరుతూ హోం మంత్రి పరమేశ్వర్‌కు, పోలీసు డైరెక్టర్ జనరల్ అలోక్ మోహన్‌కు లేఖ రాశారు.

ఆమె.. నా సోదరి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి తనకు సోదరితో సమానమని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. దిల్లీలో ఆయన విలేకరులతో మంగళవారం మాట్లాడారు. సిద్ధరామయ్య తనను ఎప్పుడూ హిట్ అండ్ రన్ వ్యక్తి అంటూ ఎద్దేవా చేసేవారని గుర్తు చేశారు. ఇంటి స్థలాలను వెనక్కు ఇస్తామంటూ ఇప్పుడు సిద్ధరామయ్య చేయించిన పని ఏమిటని ప్రశ్నించారు. తన రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఒక్క నల్లచుక్క కూడా లేదని మాట్లాడే సిద్ధరామయ్య తనపై లోకాయుక్తలో ఉన్న 70 కేసుల విచారణకు ఇప్పటి వరకు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు.

అంతా భాజపా కుట్ర

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యను ఇరికించేందుకు కమలనాథులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని భాజపా ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్ (యశ్వంతపుర) ఆరోపించారు. సిద్ధరామయ్య తన పదవికి ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. పలు ఆరోపణలు, కుంభకోణాల్లో చిక్కుకుపోయిన భాజపా నాయకులు ముఖ్యమంత్రి రాజీనామా కోరడం అర్థరహితమన్నారు. సిద్ధరామయ్యపై ఆరోపణలు రావడానికి, విపక్షాల ఆందోళనకు వెనుక తమ పార్టీ నాయకులే ఉన్నారని రాష్ట్ర మంత్రి రాజణ్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు.

భార్యను కాలువలో ముంచి చంపిన భర్త

దావణగెరె, న్యూస్‌టుడే : తన రెండో భార్య గౌరమ్మ (39)ను చిదానంద ఆచార్య హత్య చేశాడు. చెన్నగిరి తాలూకా పాండోమట్టి గ్రామానికి చెందిన చిదానందకు పలు వివాహేతర సంబంధాలు ఉన్నాయని గుర్తించారు. అతన్ని భార్య విడిచి పెట్టి వెళ్లడంతో నాలుగు నెలల కిందట రామగొండనహళ్లికి చెందిన గౌరమ్మను వివాహం చేసుకున్నాడు. వివాహమైన అనంతరం వివాహేతర సంబంధాలను కొనసాగించాడని గుర్తించి ఆమె భర్తను నిలదీసింది. అక్కడే ఆమెపై ఆగ్రహం పెంచుకున్నాడు. ఆమెను ఎలాగైనా కడతేర్చాలనే కుట్రతో తన తోటకు తీసుకువెళ్లి .. పథకం ప్రకారం కాలువలోని నీటిలో ముంచి ఊపిరాడకుండా హత్య చేసి పరారయ్యాడని పోలీసులు తెలిపారు. గౌరమ్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పరారీలో ఉన్న హంతకుని కోసం చెన్నగిరి గ్రామీణ ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది.



ఫిరంగుల మోతతో ఏనుగుల మానసిక బలాన్ని పరీక్షించే ప్రయత్నం



ఎంత శబ్దమైనా భరిస్తామని చాటుతున్న గజరాజుల వరుస



మైసూరు యువ దసరాలో భాగంగా ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

సంబరాల సుగంధం!

మైసూరు, న్యూస్‌టుడే : ప్రపంచ ప్రఖ్యాత మైసూరు దసరా సంబరాలకు తెరలేచే సమయం సమీపిస్తోంది. దసరా నవరాత్రి వేడుకలు గురువారం నుంచే ఆరంభం కానున్న నేపథ్యంలో రాచనగరి సర్వాంగ సుందరంగా రూపుదాల్చింది. వీధులన్నీ విద్యుల్లతల సోయగాలతో మిరమిట్లు గొలుపుతున్నాయి. రాచమందిరం నవ్యాతినవ్యంగా అలంకరించుకుంది. వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక సంబరాలకు అనేకానేక వేదికలు సిద్ధమయ్యాయి. వేలాది మంది కళాకారులు ఇక్కడికి చేరుకుని నిత్య ప్రదర్శనలకు మునిగాళ్లపై నిలిచారు. రాచనగరికే మణిమకుటమైన చాముండి కొండపై అమ్మవారి పూజలు జోరందుకున్నాయి. బంగారు అంబారీని మోసే ఏనుగులు మంగళవారం వివిధ రకాల తర్ఫీదులతో ముందుకు సాగాయి.

రెండంచెల భద్రత : విఖ్యాత మైసూరు దసరా ఉత్సవాలకు రెండు అంచెల్లో భద్రతను ఏర్పాటు చేస్తున్నామని నగర పోలీసు కమిషనర్ సీమా లాట్కర్ వెల్లడించారు. మొదటి దశలో 16 మంది ఎస్పీలు, 599 మంది అధికారులు, 2381 మంది సిబ్బందిని, రెండో దశలో ఇద్దరు డీఐజీలు, 27 మంది ఎస్పీలు, 989 మంది అధికారులు, 3981 మంది సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. వీరితో పాటు 10 సీఏఆర్, 33 కేఎస్ఆర్పీ, 29 ఏఎస్సీ, 3 బీడీడీఎస్ బెటాలియన్లు, ఒక గరుడ దళం, ఒక ఐఎస్‌డీ దళాన్ని భద్రతకు వినియోగించుకుంటున్నామని తెలిపారు. అక్టోబరు మూడు నుంచి 12 వరకు పలు మార్గాల్లో వాహన సంచారంలో మార్పులు ఉంటాయని తెలిపారు. నాలుగు చోట్ల తాత్కాలిక బస్టాప్‌లను ఏర్పాటు చేశామని వివరించారు.

దొంగల ముఠా కటకటాలపాలు

రూ.1.9 కోట్ల ఆభరణాల జప్తు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రుళ్లు దొంగతనాలు చేస్తున్న సన్యాసిమఠ నందీశ్ (25), నందీశ్ (25), ప్రతాప్ కుమార్ (25) అనే నిందితులను అరెస్టు చేసి.. భారీగా నగలు స్వాధీనం చేసుకున్నట్లు సుబ్రహ్మణ్యనగర ఠాణా పోలీసులు మంగళవారం ఇక్కడ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.9 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. జప్తు చేసుకున్న వాటిలో 1.802 కిలోల ఆభరణాలు, 110 గ్రాముల వెండి గొలుసులు, 8 చేతి గడియారాలు, ఒక ఇనుప రాడ్డు, శిరస్త్రాణం ఉన్నట్లు నగర పోలీసు కమిషనర్ దయానంద తెలిపారు. ఆయన మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీ సొత్తును ప్రదర్శించారు. సుబ్రహ్మణ్యనగరలోని ఒక బాధితుని ఫిర్యాదుతో పోలీసులు దాడిచేసి దుండగులను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ధర్మస్థలలో దర్శనం చేసుకుని వస్తున్న ఒక నిందితుడ్ని అనుమానం కొద్దీ శిరా తాలూకా హుళియారు వద్ద అరెస్టు చేశారు. అతని నుంచి సేకరించిన సమాచారంతో విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా ఉలువత్తి గ్రామంలో మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసి, చోరీ సొత్తు స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. ఉత్తర విభాగం డీసీపీ సైదులు అడావత్, సుబ్రహ్మణ్యనగర ఠాణా ఇన్‌స్పెక్టర్ హెచ్‌వీ సురేశ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపిస్తున్న కొత్వాలు దయానంద తదితరులు

కుమారునితో సహా తల్లి ఆత్మహత్య

బెళగావి, న్యూస్‌టుడే : చిక్కోడి తాలూకా మాంగూర గ్రామంలో తన ఏడాదిన్నర కుమారుడు కుశాల్‌తో కలిసి గాయత్రి వాఘ్మోరె (26) అనే గృహిణి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కలహాలతో ఆవేదనకు లోనై.. ఇంటి ఆవరణలోని బావిలోకి ఆమె దూకింది. ఇతర కుటుంబ సభ్యులు గుర్తించి, బయటకు తీసేలోగా వారిద్దరూ మరణించారు. చిక్కోడి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి జీవితాన్ని చిదిమేసిన టిప్పర్

ఉడుపి, న్యూస్‌టుడే : కుందాపుర తాలూకా కక్కేరి సమీపాన మంగళవారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ధనుష్ (18) అనే విద్యార్థి మరణించాడు. అతని ఇద్దరు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను కుందాపుర ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వీరు కోటేశ్వర కాళావర వరదరాజశెట్టి ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో మొదటి ఏడాది బీఎస్సీ విద్యార్థులు. కళాశాల నుంచి ఇంటికి తిరిగి వెళుతున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. కుందాపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఉత్తమ అధ్యాపకులకు పురస్కారాలు అందించి, సత్కరించిన మంత్రి చెలువరాయస్వామి తదితరులు

సేద్యానికి చక్కని ఊతం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనల్లో ముందంజ వేస్తోందని, సేద్యానికి చక్కగా ఊతమిస్తూనే ఇప్పటికే 20 మేధోపరమైన హక్కులు సాధించిందని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి ప్రశంసించారు. విశ్వవిద్యాలయ 59వ సంస్థాపన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మైసూరు మహారాణి కెంప నంజమ్మణ్ణి 1899లో హెబ్బాళ్‌లో 30 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా వ్యవసాయ క్షేత్రం ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ కేంద్రం 1913లో వ్యవసాయ కళాశాలగా మార్పు చెందినట్లు వివరించారు. సర్ ఎం. విశ్వేశ్వరయ్య నాయకత్వంలో హెబ్బాళ్ వద్ద 202 ఎకరాల్లో మైసూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రారంభమైనట్లు గుర్తు చేశారు. ధాన్యాల ఉత్పత్తి, నూనె గింజల పరిశ్రమలు అందులో భాగంగానే విస్తరించాయని తెలిపారు. దేశంలో తొలిసారిగా కేఆర్‌హెచ్-1 వరి, సీఎంఎస్ ఆధారిత సూర్యకాంతి (బీఎస్‌హెచ్-1) వంగడాలను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా ప్రతిభావంతులైన అధ్యాపకులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేష్, డాక్టర్ ప్రభాకర్‌శెట్టి, డాక్టర్ హెచ్.ఎల్.హరీశ్, బి.ఎస్.ఉల్లాస్, ఎస్.దినేశ్, డాక్టర్ ఎం.చంద్రేగౌడ, డాక్టర్ కేసీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థి.. విషాదగీతం

చిక్కమగళూరు : తాను వేణువు (ఫ్లూటు) నేర్చుకునేందుకు తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఎస్కే ధ్రువ (15) అనే విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. శివమొగ్గ జిల్లా భద్రావతికి చెందిన ధ్రువ శృంగేరి హరిహర వీధిలోని పీజీలో ఉంటూ, పదో తరగతి చదువుకుంటున్నాడు. ఫ్లూటు క్లాసుకు వెళతానని కోరగా, చదువుపై ధ్యాస ఉంచాలని తల్లిదండ్రులు సూచించడంతో ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

'మునిరత్న' విచారణ పూర్తి

శివాజీనగర, న్యూస్‌టుడే : అత్యాచారం, హనీట్రాప్ చేయించిన ఆరోపణలపై అరెస్టయిన ఎమ్మెల్యే మునిరత్న బెయిలు కోసం వేసుకున్న అర్జీపై వాదనలు పూర్తయ్యాయి. తీర్పును గురువారం ప్రకటిస్తామని సంబంధిత న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే తెలిపారు.


పరిషత్ అభ్యర్థిగా కిశోర్



మంగళూరు, న్యూస్‌టుడే : తమ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కిశోర్‌కుమార్ పుత్తూరు పేరును భాజపా కేంద్రీయ ఎన్నికల సమితి ప్రకటించింది. దక్షిణ కన్నడ జిల్లా భాజపా ప్రధాన కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారు. ఇక్కడ ఎమ్మెల్సీ కోటా శ్రీనివాస పూజారి పదవికి రాజీనామా చేసి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఖాళీ అయిన స్థానానికి జరిగే ఉప ఎన్నికలకు కిశోర్ కుమార్‌ను పార్టీ ఎంపిక చేసింది. దక్షిణ కన్నడ స్థానిక సంస్థల స్థానం నుంచి ఆయన పోటీ చేయనున్నారు. ఇప్పటి వరకు ఆ స్థానానికి కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల తేదీని ప్రకటించలేదు. రాష్ట్రంలో మరో మూడు ఉప ఎన్నికలతో పాటు ఆ స్థానానికి కూడా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

జనతాదళ్ నాయకుడి అరెస్టు

బాగలకోటె, న్యూస్‌టుడే : రామారూఢ మఠాధిపతి పరమరామారూఢ స్వామిని బెదిరించి రూ.కోటి వసూలు చేసిన జనతాదళ్ నాయకుడు ప్రకాశ్ ముధోళను బాగలకోటె ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆ నగదుతోనే గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేసి, ఖర్చు చేసుకున్నాడు. అతనిపై మూడు దొంగతనం, మూడు వంచన, మూడు దోపిడీతో పాటు మొత్తం 12 కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మఠాధిపతి ఫిర్యాదుతో నిందితుడ్ని అరెస్టు చేశారు. ఈ ఘటనలో మరో ముగ్గురు పరారీలో ఉన్నారని గుర్తించారు.



అహింసాయుధధారి
అలుపెరుగని బాటసారి

● గనినాడులో మహాత్ముడి స్మృతులు
● నేడు గాంధీ జయంతి



బళ్లారి రైల్వే స్టేషన్

బళ్లారి, న్యూస్‌టుడే: అహింసే ఆయుధంగా చేసుకుని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహాత్మా గాంధీకి బళ్లారి జిల్లాతో విడదీయరాని సంబంధం ఉంది. స్వాతంత్ర్యానికి ముందు రెండుసార్లు గాంధీ బళ్లారి జిల్లాకు వచ్చారు. తెల్లదొరలపై పోరులో భాగంగా 1921 అక్టోబరు 1న అనంతపురం నుంచి దార్వాడకు వెళ్తూ మార్గమధ్యలోని బళ్లారి రైల్వేస్టేషన్‌లో ఓ రాత్రి బస చేశారు. అప్పట్లో బళ్లారి నగరంలో కర్ణాటక - ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీల మధ్య భేదాభిప్రాయాలు ఉండేవి. ఓ వర్గం వద్దకు వెళ్లి విశ్రాంతి తీసుకుంటే మరో వర్గం ఇబ్బందికి గురవుతారని ఆ రోజు రాత్రి బళ్లారి రైల్వేస్టేషన్‌లో బ్రిటిష్ అధికారులు ప్రత్యేక విశ్రాంత గదిని చూపించినా తిరస్కరించారు. అక్కడ రైల్వే స్టేషన్ ముందు సామాన్య ప్రయాణికుల మాదిరిగా ఓ స్తంభం వద్ద ఎనిమిది గంటల పాటు విశ్రాంతి తీసుకున్నారు. తెల్లవారుజామున రైల్లో ద్వారాడకు బయలుదేరి వెళ్లారు. రెండో సారి 1934లో హరిజనోద్ధరణ ఉద్యమంలో భాగంగా సండూరు తాలూకాలోని కుమారస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. హరిజనులకు ఆలయ ప్రవేశం లేదని తెలుసుకుని కుమారస్వామి దేవస్థానాన్ని పరిశీలించారు. అప్పటి సండూరు మహారాజ మురారి ఘోర్పడేతో చర్చలు జరిపి దేవస్థానంలోకి హరిజనులకు ప్రవేశం కల్పించారు. మార్చి 3న సండూరులో పర్యటించిన సందర్భంలో అక్కడ ప్రకృతి అందాలకు ముగ్ధుడై.. సెప్టెంబరులో సండూరు ప్రకృతి అందాలను తిలకించాలని (సీ సండూరు ఇన్ సెప్టెంబరు) ప్రకటించారు. నాటి నుంచి నేటి వరకు సండూరు ప్రకృతి అందాలను తిలకించడానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వెళ్తున్నారు. ప్రకృతి అందాలను తిలకించడానికి అటవీశాఖాధికారులు ప్రత్యేకంగా పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అక్కడే మహాత్మాగాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

బళ్లారి నగరంలో స్మారకం

1948లో మహాత్మాగాంధీ అసువుల బాసిన అనంతరం ఆయన చితాభస్మాన్ని బళ్లారికి తీసుకొచ్చారు. అప్పట్లో హలహర్వి సీతారామరెడ్డి మద్రాస్ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ మంత్రిగా ఉండేవారు. రామానంద తీర్థ నేతృత్వంలో దిల్లీ నుంచి చితాభస్మాన్ని రైల్లో మద్రాసుకు తీసుకెళ్లి అక్కడి నుంచి బళ్లారికి తెచ్చారు. రాత్రికి గాంధీభవనంలో ఉంచి అక్కడ నుంచి కూడ్లిగికి తీసుకెళ్తున్న సమయంలో రేడియో పార్క్ (ప్రస్తుతం డైట్ కళాశాల) ప్రాంగణంలో కొద్ది సేపు పెట్టారు. గాంధీ భవనంలో స్మారకం, బళ్లారి డైట్ కళాశాలలో ప్రత్యేకంగా గాంధీ స్మారకం ఏర్పాటు చేశారు. కూడ్లిగి పట్టణంలో మైలార మహదేవ క్రీడామైదానంలో గాంధీ స్మారకం నిర్మించారు. 1921 అక్టోబరు 1న బళ్లారి రైల్వే స్టేషన్ ముందు ఎనిమిది గంటల పాటు విశ్రాంతి తీసుకోవడంతో అక్కడా స్మారకం ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్‌లో గాంధీ విగ్రహం ప్రతిష్ఠించడానికి అనుకూలం లేకపోవడంతో సమీపంలోని డా. రాజ్‌కుమార్ ఉద్యానవనం ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేశారు. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



హుదలిగె గ్రామంలో నదికి వెళ్తున్న గాంధీ

గ్రామోద్యమంలో ప్రముఖ పాత్ర

బ్రిటిష్ ప్రభుత్వం ఖాదీ దుస్తులను వ్యతిరేకించేది. ఖాదీ దుస్తులు వేసుకున్న వారిపై పాలకులు కఠినంగా వ్యవహరించేవారు. అలాంటి సందర్భంలో గంగప్ప ముద్దప్ప మాళిగి, సోదరుడు చెన్న బసప్ప ముద్దప్ప ఖాదీ గ్రామోద్యమంలో పాల్గొన్నారు. వీరు చేస్తున్న ఉద్యమానికి చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 250మందికి పైగా ప్రజలు మద్దతు ప్రకటించారు. గంగప్ప 15 ఏళ్ల వయసులో గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గాంధీ 1937లో హుదలిగె గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గంగప్ప ముద్దప్ప మాళిగి సోదరి పెళ్లి సందర్భంగా మరోసారి గ్రామాన్ని సందర్శించారు. వారం రోజులపాటు గాంధీ అక్కడే బస చేశారు. గంగప్ప ముద్దప్ప మాళిగికి వందేళ్లు నిండినా ఖాదీ దుస్తులనే ధరించడం విశేషం.



సీ సండూరు ఇన్ సెప్టెంబరు అని గాంధీ సందర్శించిన ప్రదేశంలో స్మారకం

బెళగావితో అనుబంధం


మహాత్మాగాంధీకి బెళగావి జిల్లా హుదలిగె గ్రామ ప్రజలతో మంచి సంబంధాలు ఉండేవి. ఆ గ్రామానికి చెందిన గంగాధర దేవ్‌పాండేకు లోక్‌మాన్య బాలగంగాధర తిలక్‌తో పరిచయం ఉండడంతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేవారు. వీరి పరిచయంతో మహాత్మాగాంధీ హుదలిగె గ్రామాన్ని సందర్శించారు. చెన్నబసప్ప, గంగప్ప ముద్దప్ప మాళిగి గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. గాంధీ బెళగావి నుంచే ఖాదీ గ్రామోద్యోగ ఉద్యమాన్ని ప్రారంభించారు. బెళగావి జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో హుదలిగె గ్రామం ఉంటుంది. ఈ గ్రామంలో పలువురు ఆయన సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. గాంధీకి అత్యంత ఆప్తుడిగా పేరొందిన గంగప్ప ముద్దప్ప మాళిగి (100) 2023లో తుదిశ్వాస విడిచారు.



బళ్లారి నగరం రేడియోపార్క్‌లోని డైట్ కళాశాలలో గాంధీ చితా భస్మ స్మారకం



సండూరు ప్రకృతి అందాలు చూడటానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాయింట్



హుదలిగె గ్రామంలో మాళిగి కుటుంబ సభ్యులతో వెళ్తున్న గాంధీ



గాంధీజీ జ్ఞాపకార్థం నిర్మించిన భవనం

సిద్దు సింధనూరు పర్యటన ఖరారు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు దసరా పేరిట తొమ్మిది రోజుల వేడుకలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రాయచూరు జిల్లా పర్యటన ఖరారైంది. ఈ మేరకు అధికార యంత్రాంగానికి అధికారిక టీపీ అందింది. 3న దసరా ఉత్సవాలు ప్రారంభించే సీఎం సిద్ధరామయ్య నాలుగున ఉదయం మైసూరు నుంచి నేరుగా ఎంఎస్‌పీఎల్ వారి ఎయిర్ స్ట్రిప్‌లో కొప్పళ సమీపంలోని గిణిగేరలో దిగుతారు. అక్కడ నుంచి రహదారి మీదుగా 12.15 గంటలకు సింధనూరు చేరుకుంటారు. ఆ రోజు రాత్రి తొమ్మిది గంటల వరకూ సీఎం సింధనూరులోనే ఉండి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. తొలుత సింధనూరు దసరా ఉత్సవాలకు తెర లేపుతారు. అనంతరం వేదికపై పూర్తయిన సందర్భంగా 'కల్యాణ కర్ణాటక నడె' ప్రారంభిస్తారు. ఆ పై రాయచూరు జిల్లా ఉడ్డె గుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం రూ.1635 కోట్ల భారీ మొత్తంతో సింధనూరు-కల్లూరు జంక్షన్ (రాయచూరు) వరకూ నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి, గొరేబాళ క్యాంపు నుంచి గంగావతి రోడ్ వరకూ గల గ్రామీణ రహదారి నిర్మాణాలకు సీఎం సింధనూరు వేదికపై నుంచి భూమిపూజ చేస్తారు. రాత్రి తొమ్మిది గంటలకు సింధనూరు నుంచి రోడ్డు మార్గంలో రాయచూరు పయనమవుతారు. అయితే తేదీన రాయచూరు, మాన్వి కార్యక్రమాల్లో పాల్గొని అదే రోజు సాయంత్రం ఆయన గంటలకు మళ్లీ సింధనూరు మీదుగానే గిణిగేర వెళ్లి విమానంలో బెంగళూరు బయలుదేరతారు. ఈ కార్యక్రమాల కోసం సింధనూరు సింగారించుకుంటోంది.



దీపకాంతులతో సింధనూరు రహదారులన్నీ మిరిమిట్లు

లారీని ఢీకొన్న కారు.. ఇద్దరి దుర్మరణం

చెళ్లకెరె(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హిరియూరు పట్టణ సమీపంలోని పుణె- బెంగళూరు జాతీయ రహదారిలో చోదకుని నిర్లక్ష్యంతో కారు ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొనడంతో హోసపేటకు చెందిన పారిశ్రామిక వేత్త సిద్ధలింగస్వామి(58), ఆయన తల్లి తాయి జగన్నాతే (78) దుర్మరణం చెందారు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగిందని పోలీసులు తెలిపారు. బెంగళూరు నుంచి హోసపేట వైపు బయలుదేరిన కారు హిరియూరు వద్ద లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారును నడుపుతున్న సిద్ధలింగస్వామి ప్రమాద స్థలం వద్దనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన తాయి జగన్నాతెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. హిరియూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



హిరియూరు వద్ద లారీని ఢీకొని నుజ్జయిన కారు ముందు భాగం

టైరు పేలి చోదకుడి మృతి

హోసపేటె: పంక్చరైన లారీ టైరులో గాలినింపుతున్న సమయంలో అది పేలి నాగరాజ్(40) అనే ట్రాక్టర్ చోదకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి హోసపేటె తాలూకా హాళేమలపన గుడిలో జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ చోదకుడు నాగరాజ్ పంక్చరైన లారీ టైరును ట్రాక్టర్‌లో వేసుకుని హోసమలపన గుడిలో పంక్చర్ వేయించారు. టైరుకు గాలి నింపే సమయంలో అది పేలింది. ముఖం, ఛాతీపై తీవ్రగాయాలై అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిపై హోసపేటె గ్రామీణ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తుంగభద్రలో వానర భయం

హోసపేటె, న్యూస్‌టుడే: మనుషులు కనిపిస్తే దాడికి దిగే వానరంతో టి.బి.డ్యాం వాసులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటివరకు సుమారు పదిమందిపై వానరం దాడి చేసి గాయపరిచిందని స్థానికులు వాపోతున్నారు. తాజాగా మంగళవారం శేఖర్ అనే వ్యక్తిపై వానరం దాడిచేసి రెండుచేతులు, పొట్టపైన కరిచింది. దీంతో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటేనే జంకే పరిస్థితి ఏర్పడింది. వానరం దాడిలో తీవ్ర గాయాలైన శేఖర్ హోసపేటె ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్నారు. ఈ ప్రాంతంవాసులను భీతిగొలుపుతున్న వానరాన్ని వెంటనే బంధించాలని స్థానికులు కోరుతున్నారు.

● **బాలుడిపై వీధికుక్క దాడి..** పట్టణ పరిధి చిత్తవాడ్గీలో ఓ వీధికుక్క దాడిలో ఆయన్ అనే ఎనిమిదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం వీధిలో ఆడుకుంటున్న బాలుడిపై కుక్కదాడిచేసి రెండూ కాళ్లకు కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలుడికి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు.



కర పత్రాలను ప్రదర్శిస్తున్న పోరాట సమితి నాయకులు

సమావేశ కరపత్రాల విడుదల

కంప్లి: ఈనెల 5న బెంగళూరులో జరగనున్న భూమి వసతి హక్కు వంచితర ప్రాతినిధ్య సమావేశ కరపత్రాలను కంప్లిలో ఆ పోరాట సమితి నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు కరియప్ప గుడిమని, వసంతరాజ కహళె మాట్లాడుతూ బెంగళూరులో జరిగే సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ మంత్రి కృష్ణ బైరేగౌడ రానున్నారు. ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలన్న విషయమై ఆ సమావేశంలో చర్చించారు. జిల్లాలో అలాంటి భూములను సాగు చేస్తున్న రైతులు సమావేశానికి హాజరు కావాలంటూ కరపత్రాలను ప్రదర్శించారు. సమితి నాయకులు నీలప్ప పేంటర్, రవి మణ్ణూరు, శ్రీకాంత్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ప్రవాహం

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్రకు వస్తున్న ప్రవాహం బాగా తగ్గింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పూర్తిగా ఆగడంతో జలాశయానికి 8277 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. రాయచూరు, కొప్పళ జిల్లాలను తడిపే ఎడమ కాలువ, బళ్లారి, కర్నూలు, కడప జిల్లాలకు పారే కుడి దిగువ కాలువ (ఎల్లెల్సీ), బళ్లారి, అనంతపురం జిల్లాలను తడిపే కుడి ఎగువ కాలువ(హెచ్చెల్సీ)లు కలిపి మొత్తం 10,177 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి బయటకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో తగ్గి, అవుట్‌ఫ్లో పెరగడంతో మంగళవారం నుంచి జలాశయంలో నిల్వ ఉన్న జలాల నుంచి తరుగుదల ప్రారంభమైంది. ఈ నీటి సంవత్సరంలో జలాశయం రెండుసార్లు భర్తీకావడం ప్రత్యేకం. 19వ గేటు కొట్టుకుపోవటానికి ముందు ఒకసారి, గేటు స్థానంలో స్టాప్‌లాగ్‌లను అమర్చిన తరువాత మరోసారి జలాశయం పూర్తిగా నిండింది. అక్టోబరు, నవంబరు నెలల్లో మరోసారి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని డ్యాం ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 101.578 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి.

3 నుంచి దేవీ ఉత్సవాలు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి ఆరో వార్డు కాకతీయ నగర్‌లో వెలిసిన గౌసముద్ర మారెమ్మ దేవి ఆలయంలో మూడో తేదీ నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయంలో 10 రోజులు ప్రత్యేక పూజలు ఉంటాయి. దుర్గాష్టమి నాడు అన్న సంతర్పణ ఉంటుందని ఆలయ సమితి ప్రతినిధులు తెలిపారు.



కంప్లిలోని గౌసముద్ర మారెమ్మ

దేవిక్యాంపు రత్నగిరిపై

దేవిక్యాంపు (కారటగి): కారటగి సమీప దేవిక్యాంపు రత్నగిరిపై వెలిసిన శ్రీదేవి శరన్నవరాత్రులు ఈనెల 3న ప్రారంభం కానున్నాయి. 4న మెట్లోత్సవం ఉంటుంది. విజయవాడలోని కనకదుర్గాదేవి మాదిరిగా రోజూ ఓ రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. విజయదశమి రోజు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఏకాదశి నాడు మహా అన్న సంతర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయిని శ్రీదేవి బీరేశ్వర ఆలయ సమితి ప్రతినిధి కొల్లా శేషగిరిరావు తెలిపారు.

నల్ల కృష్ణమూర్తికి జిల్లా శ్రేష్ఠ నాగరిక ప్రశస్తి

సింధనూరు: సింధనూరు తాలూకా ఈజే. హొసళ్లి క్యాంపునకు చెందిన తెలుగు పెద్ద నల్ల కృష్ణమూర్తిని జిల్లా పాలనా యంత్రాంగం మంగళవారం రాయచూరులో 'జిల్లా శ్రేష్ఠ నాగరిక' పురస్కారం అందించి సత్కరించింది. పండిత సిద్ధరామ జంబలదిన్ని రంగమందిరంలో జిల్లా నాగరిక సబలీకరణ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఆచరించింది. ఈ కార్యక్రమంలో అధికారులు నల్ల కృష్ణమూర్తికి ప్రశస్తిని అందించారు. హొసళ్లిక్యాంపు వేదికగా కృష్ణమూర్తి తనయుడు నల్ల అశోక్ పాల వ్యాపారంతో పాటు ప్రవృత్తిగా అయిదేళ్ల కిందట అక్షర ఆహార జోళిగె అనే సేవా సంస్థను స్థాపించారు. ఈ సంస్థకు నల్ల కృష్ణమూర్తి గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారు. ఎక్కడ ఏ వేడుకలు, పుణ్యకార్యాలు జరిగినా.. అందులో మిగిలిపోయిన ఆహారాన్ని తమ వాహనంలో వెళ్లి తెచ్చుకుని.. నిరుపేదలకు, అన్నార్థులకు వడ్డిస్తుంటారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రశస్తి అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.



పురస్కారాన్ని అందుకుంటున్న నల్ల కృష్ణమూర్తి

పాతకక్షలతో రౌడీలపై దాడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని రౌడీలపై దాడి చేసి, హత్యాయత్నం చేసి పరారైన ఆరుగురిని రాజగోపాలనగర ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. రమేశ్, తేజస్, మంజునాథ్, అరుణ్, దీక్షిత్, సాకేత్‌లను నిందితులుగా గుర్తించారు. నందిని లేఅవుట్ ఠాణాలో రౌడీషీట్లు ఉన్న నరేంద్ర, విక్రమ్, నరేంద్ర అలియాస్ శివు, దర్శన్, భరత్‌లపై వీరు గత నెల 26న రాత్రి మారణాయుధాలతో దాడి చేశారు. గస్తీ పోలీసులు అక్కడకు రావడంతో నిందితులు పరారయ్యారు. గాయపడిన బాధితులను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, ప్రాణాపాయం తప్పింది. నిందితులను అరెస్టు చేసిన పోలీసు బృందాన్ని నగర పోలీసు కమిషనర్ అభినందించారు.

తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన కాపలాదారు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తాను పని చేస్తున్న అకౌంటెంట్ కార్యాలయంలో నగలు దొంగిలించిన ఆరోపణలపై నారాయణ స్వామి (34) అనే కాపలాదారును సిద్ధాపుర ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దొంగిలించిన నగలతో కొనుగోలు చేసిన రూ.10.95 లక్షల విలువైన కారును సీజ్ చేశారు. దాంతో పాటు ఉంగరం, బ్రేస్‌లెట్, ఖరీదైన చరవాణి, గడియారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారు డిక్కీలో దాచి పెట్టిన రూ.3.5 లక్షల నగదు గుర్తించారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతిభ వెలుగులోకి



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గోపాల్, నాగేశ్ రావు, రమేష్ బుజ్జి తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల ప్రతిభ వెలికితీయవచ్చని ఉప నిర్దేశకుడు గోపాల్ పేర్కొన్నారు. రాష్ట్ర విద్యార్థి క్షేమాభివృద్ధి నిధి, పదవీ పూర్వ శిక్షణ శాఖ బళ్లారి, బెంగళూరు, ప్రభుత్వ మున్సిపల్ పదవీ పూర్వ కళాశాల, ప్రధాన ఆచార్యుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పదవీ పూర్వ కళాశాలలో జిల్లా స్థాయి పదవీ పూర్వ కళాశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీల కార్యక్రమాన్ని మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. ప్రతిభావంత విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు పదవీ పూర్వ శిక్షణ కీలకమైందన్నారు. రెండేళ్ల పాటు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ కళాశాల ప్రధాన ఆచార్యుడు నాగేశ్ రావ్, ప్రధాన ఆచార్యుడు శ్రీశైల, విఠ్ఠల్, సణ్ణ శివరాం, కళాశాల సభ్యులు రమేష్ బుజ్జి, సభ్యులు సిద్ధణ్ణ, రమేశ్, వేణుగోపాల్, కుమారస్వామి, తిమ్మప్ప, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

చీపురు పట్టిన తహసీల్దారు

సింధనూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా అభియాన్‌లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం సింధనూరు తహసీల్దారు అరుణ్ దేశాయ్ కళాశాల విద్యార్థినులతో కలసి చీపురు పట్టి మినీ విధానసౌధ ప్రాంగణం శుభ్రం చేసే పనిలో పాలుపంచుకున్నారు. నగరాభివృద్ధి శాఖ పిలుపు మేరకు స్వచ్ఛతా అభియాన్‌లో భాగంగా గాంధీ జయంతికి ఒక రోజు ముందు స్థానిక పాటిల్ మహిళా కళాశాల విద్యార్థినులు మినీ విధానసౌధ వద్ద శ్రమదానం చేపట్టారు. చీపుర్లు, బుట్టలు పట్టుకుని తమ ప్రాంగణంలో చెత్తను ఏరిపారేశారు. సంస్థ కార్యదర్శి ఆర్.సి.పాటిల్ కూడా ఇందులో పాల్గొన్నారు. విషయం తెలుసుకుని తమ కార్యాలయ ఛాంబర్‌లో ఉన్న తహసీల్దారు అరుణ్ వెంటనే అక్కడికి చేరుకుని విద్యార్థులతో కలసి తానూ అభియాన్‌లో పాల్గొన్నారు.



మినీ విధానసౌధలో స్వచ్ఛతలో పాల్గొన్న తహసీల్దారు అరుణ్ దేశాయ్

'ఉపాధ్యాయులు వృత్తి గౌరవాన్ని కాపాడాలి'



ఉపాధ్యాయులను సత్కరించిన మంత్రి బోసురాజు తదితరులు

సిరివార, (మాన్వి) : సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన స్థానముందని, దాన్ని కాపాడుకోవాలని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను గుర్తించాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలోనే ప్రథమంగా మాన్వి తాలూకా ఉపాధ్యాయులకు బంగారు పతకాలను ఇచ్చి ప్రోత్సహించినట్లు చెప్పారు. ప్రభుత్వం శిక్షణ, ఆరోగ్య రంగాలకు అధికంగా నిధులు కేటాయిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించామన్నారు. ఐదు వేల మంది ఉపాధ్యాయులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే హంపయ్యానాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ కర్తవ్యాన్ని నిర్వహించినప్పుడు ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. మంత్రి బోసురాజు నియోజకవర్గానికి పాఠశాలు, కళాశాలలు, వసతి నిలయాలను మంజూరు చేయించారన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి బంగారు పతకాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి ఎస్ అంగడి, బీఈఓ చంద్రశేఖర్, టీపీ ఈఓ శశిధర్‌స్వామి, సంగమేష్, అశోక్‌కుమార్, తిమ్మణ్ణ బల్లటిగి, శాంతప్ప తదితరులు పాల్గొన్నారు.



మాన్విలో సీఎం సభావేదికను పరిశీలిస్తున్న బోసురాజు, నాయక్

మాన్విలో సీఎం సభావేదిక పరిశీలన

ఈ నెల 5న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాన్వి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పరిశీలించారు. సీఎం బహిరంగ సభకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా పనులు చేయాలని ఆయన సూచించారు. వేదిక నిర్మాణం, ఆసనాలు, పార్కింగ్ స్థలం పరిశీలించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిభాచాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వీరేష్, ఉపాధ్యాయులు

ప్రతిభాకారంజీ విజేతలకు అభినందన

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడంలో ప్రతిభాకారంజీ వేదికలు అవసరమని వక్తలు సూచించారు. పాఠశాల శిక్షణ, సాక్షరతా శాఖ, క్షేత్ర శిక్షణాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఇందిరానగర్ క్లస్టర్ ప్రతిభాకారంజీ పోటీలను ప్రారంభించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వాసవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు 18 మంది రంగవల్లులు, భావగీతాలాపన, భక్తి గీతాలాపన, చిత్రకళాపోటీలు, ఉపన్యాసం, క్విజ్, భగవద్గీత పఠనం, సంగీతం తదితర పోటీల్లో ప్రతిభాచాటి బహుమతులు అందుకున్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వీరేష్, ఉపాధ్యాయులు ప్రశంసించారు.

బళ్ళారి

కృషిరత్న పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: 2023-24 ఏడాదికి కల్యాణ కర్ణాటక పరిధిలో ఉత్తమ రైతులకు కృషి రత్న ప్రదానం అందజేసి అభినందిస్తాం. కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వ్యవసాయశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం 16వ వార్షికోత్సవం నవంబరు 22న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కల్యాణ కర్ణాటకలో ఉత్తమ రైతులకు కృషి రత్న పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈనెల 31లోపు కృషి విస్తరణ శిక్షణ కేంద్రం కార్యాలయానికి పంపాలని కోరారు.

నేడు ఉపాధి హామీ పథకం అభియాన్



జిల్లా సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూర

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో అక్టోబరు 2న ఉపాధి హామీ పథకం వైపు నడక అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబరు 2 నుంచి నెల రోజులపాటు జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతి కుటుంబానికి 100 రోజులు ఉపాధి కల్పించడం, రోజు వారీ కూలీ రూ.349లకు పెంచినట్లు చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులకూ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీల వారీగా పనులిలా..

ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పశువుల షెడ్డులు, గొర్రెల షెడ్డు, కోళ్లఫారం షెడ్డు, సేంద్రియ ఎరువుల తయారీ తొట్టెలు, సోక్ పిట్, సాగు గుంతలు, మట్టి కట్టలు, బోరుబావుల రీఛార్జ్ చేసుకోవడం, అజొల్లా యూనిట్, చేపల పెంపకం చెరువు, ఉద్యానవన శాఖ నుంచి దానిమ్మ, కొబ్బరి, మామిడి, సపోటా, బత్తాయి, అంజూర, కరివేపాకు, గులాబీ, మల్లె, మల్లిగే తదితర పంటల సాగుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం పనులకు జాబ్‌కార్డులు లేకపోతే గ్రామ పంచాయతీలో జరిగే సమావేశంలో చర్చించి అర్హులకు జాబ్‌కార్డులు అందజేయాలని సీఈవో అధికారులను సూచించారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు అవకాశం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో ఉన్న వెనకబడిన వర్గాల కల్యాణ శాఖ వసతి గృహాలకు మెట్రిక్ అనంతరం బాల, బాలికల ప్రవేశాలకు (వృత్తి పర పదవీ, స్నాతకోత్తర పదవీ విద్యార్థులకు మాత్రమే) అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ లోపు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు రంగమందిరం ఎదురుగా ఉన్న డి.దేవరాజు అరసు భవనంలోని వెనకబడిన వర్గాల కల్యాణశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: సిరుగుప్ప 110/11కె.వి. విద్యుత్తు సరఫరా కేంద్రంలో మరమ్మతులు జరుగుతుండటం వల్ల ఈ నెల 3న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి తెలిపారు. కేంద్రం పరిధిలోకి వచ్చే సిరుగుప్ప పారిశ్రామిక ప్రాంతం, బగ్గూరు, రారావి, కురువళ్లి, రావిహాళు, బి.ఎం.సూగూరు తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు చెప్పారు.

14న పింఛను అదాలత్

బళ్లారి, న్యూస్‌టుడే: కార్మిక భవిష్య నిధి సంస్థ, బళ్లారి ప్రాదేశిక కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగర ప్రాదేశిక కార్యాలయంలో పింఛను అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాదేశిక కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. బళ్లారి, విజయనగర, కొప్పళ, చిత్రదుర్గం జిల్లాలకు చెందిన పింఛనుదారులు ఇ-మెయిల్ ద్వారా, లేకుంటే స్పీడ్‌పోస్ట్, చరవాణి ద్వారా ఈనెల 10లోపు నమోదు చేసుకోవాలన్నారు.

బాపూజీపై వ్యాసరచన పోటీలు

హొసపేటె, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని విజయనగర జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ బాపూజీ జీవితం, ఆదర్శాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల ఫలితాలు వెలువడ్డాయి. మాధ్యమిక పాఠశాల, పీయూసీ, డిగ్రీ స్నాతకోత్తర విభాగాల్లో పోటీలు జరిగాయి. మాధ్యమిక పాఠశాల విభాగంలో విద్యార్థి భరత్‌కుమార్ (కొట్టూరు తాలూకా) ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థినులు వీణా (హగరిబొమ్మనహళ్లి), ఉషా క్రమంగా ద్వితీయ, తృతీయ స్థానాలు సంపాదించుకున్నారు. పీయూసీ విభాగంలో విద్యార్థిని భవాని (కొట్టూరు) ప్రథమ, విద్యార్థినులు రియాన్(హడగలి), అక్షతా (హొసపేటె) క్రమంగా ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకున్నారు. డిగ్రీ స్నాతకోత్తర విభాగంలో విద్యార్థి ప్రవీణ్ సింగప్ప (హంపీ వర్సిటీ) ప్రథమ, విద్యార్థినులు వి.కల్యాణి(హొసపేటె), శీతల్ (హొసపేటె)లు క్రమంగా రెండు, మూడో స్థానంలో నిలిచారు. ఈ నెల 10న హొసపేటెలో ఏర్పాటు చేయనున్న జిల్లాస్థాయి గాంధీ జయంతిలో విజేత విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తామని ఆ శాఖ సహాయక సంచాలకుడు గవిసిద్ధప్ప హొసమని తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

బళ్లారి, న్యూస్‌టుడే: కురుగోడు పోలీస్‌స్టేషన్ వ్యాప్తికి చెందిన రేణుకమ్మ (38) అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఆమె కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. సెప్టెంబరు 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

ముష్టూరు క్యాంపు (శ్రీరామనగర), న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని కారటగి తాలూకా ముష్టూరు క్యాంపు రామాలయం ఆవరణలో బుధవారం ఏడో సంవత్సర స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరగనుంది. ముష్టూరు క్యాంపు, అంజూరి క్యాంపు, ముష్టూరు దగ్గి, హెబ్బాళ, హెబ్బాళ క్యాంపు, డణాపుర, మారుతి నగర్, జంగమర కల్లుడి, శ్రీరామనగర, వినాయక గెళెయర బళగ, అవధూత అయ్యప్ప తాత గెళెయర బళగ సహకారంతో ఈ శిబిరం జరగనుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్న ఈ శిబిరంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని నిర్వాహకులు కోరారు.

పెద్దల అనుభవం.. యువతకు మార్గదర్శకం

ఘనంగా వృద్ధుల దినోత్సవం



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని



మాట్లాడుతున్న ముండరగి నాగరాజ

బళ్లారి, న్యూస్‌టుడే: యువతను సమాజంలో సరైన దారిలో నడిపించడంలో వృద్ధుల మార్గదర్శకత్వం ఎంతో అవసరం. వారి అనుభవాల ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుందని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చర్మ పరిశ్రమ అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజ సూచించారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, మహిళా - శిశు అభివృద్ధి, దివ్యాంగులు, వృద్ధుల సబలీకరణ జిల్లా శాఖ, న్యాయసేవా ప్రాధికార సంస్థ వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం డా.జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన వృద్ధుల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు 60 ఏళ్లు నిండిన తర్వాత అంతా అయిపోయిందనే భావన నుంచి బయటకు వచ్చి మీ అనుభవం, మార్గదర్శనంతో సమాజాభివృద్ధికి శ్రమించాలన్నారు. వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చింది. రాష్ట్రంలో 108 వృద్ధాశ్రమాలు ఉన్నాయి. 26 జిల్లాల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలతో పాటు 27 వగైరి యోగక్షేమ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. వృద్ధులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా న్యాయమూర్తి, న్యాయసేవా ప్రాధికార సదస్య కార్యదర్శి రాజేష్ ఎన్.హొసమని మాట్లాడుతూ నేడు వృద్ధులు నిర్లక్ష్యానికి గురికావడం శోచనీయమన్నారు. వృద్ధులను గౌరవంగా చూసుకోవాలి. వృద్ధులు నేటి తరంలో నైతిక విలువలు, జీవిత మార్గదర్శకాలను పెంపొందించుకుని ప్రశాంత జీవనం సాగించాలన్నారు. సీనియర్ల కోసం రూపొందించిన చట్టాలను వినియోగించుకోవాలి. అదనపు జిల్లా పాలనాధికారి మహమ్మద్ ఝుబేర మాట్లాడుతూ ఇంట్లో వృద్ధులు మాత్రమే కుటుంబాన్ని నిర్వహించగలరన్నారు. వృద్ధుల ఆరోగ్యపరిరక్షణ కోసం ప్రత్యేకాలు పింఛను తీసుకుని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వందేళ్ల నిండిన, పూర్తి అయిన వృద్ధులను సన్మానం చేశారు. కార్యక్రమానికి మేయర్ ముల్లంగి నందీశ్, ఏఎస్పీ కె.పి.రవికుమార్, అధికారులు విజయకుమార్, గోవిందప్ప, రామకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివాజీ రావ్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.టి.మల్లేశ్, ఉమేశ్‌గౌడ, వెంకమ్మ, తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వృద్ధులకు బహుమతులు అందజేసి అభినందించారు.



కార్యక్రమానికి హాజరైన వృద్ధులు



సిరుగుప్ప: మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, న్యాయవాదులు

పెద్దలను గౌరవించడం అందరి బాధ్యత

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పెద్దలను గౌరవించి వారిని ఆదరించాల్సిన బాధ్యత కుటుంబసభ్యులతో పాటు అందరిపై ఉంటుందని తహసీల్దార్ విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం చట్ట సేవా సమితి, న్యాయవాదుల సంఘం, ప్రభుత్వ యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ల దినోత్సవాన్ని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు యు.వెంకోబ, ఇతర అధికారులు, న్యాయవాదులతో కలిసి మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. 1990 అక్టోబరు 1 నుంచి వృద్ధుల దినోత్సవాన్ని ఆచరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లకు మంజూరు చేసిన పింఛను కార్డులను పంపిణీ చేశారు. గ్రేడ్-2 తహసీల్దార్ సత్యమ్మ, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు షరీఫ్‌సాబ్, న్యాయవాదులు నెలగుంటయ్య స్వామి, మహేశ్, సరోజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోజువారి పనుల ఒత్తిడితోనే మతిమరుపు



మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని

బళ్లారి, న్యూస్‌టుడే: రోజువారీ పనులతో మానసిక ఒత్తిడితో మతిమరుపు వచ్చే అవకాశం ఉంది. వృద్ధులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి...ఆరోగ్యకర జీవనం సాగించాలని న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సదస్య కార్యదర్శి రాజేష్ ఎన్.హొసమని సూచించారు. జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఆసుపత్రి సభాభవనంలో ఏర్పాటు చేసిన మెదడు ఆరోగ్యం, చికిత్సపై ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని న్యాయమూర్తి ప్రారంభించి మాట్లాడారు. పని ఒత్తిడితో చిన్న పిల్లల నుంచి యువత, వృద్ధులకు మతిమరుపు వస్తోంది. మెదడుకు వచ్చే వ్యాధుల నుంచి బయటపడేందుకు యోగా, ధ్యానం, వ్యాయామం, ప్రాణాయామం దినచర్యగా చేసుకోవాలని సూచించారు. సమాజంలో పెద్దలను గౌరవించడం దేశంలో ఆనవాయితీగా వస్తోంది. వృద్ధుల ఆరోగ్యం, ఆహారం గురించి వివరించారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు మాట్లాడుతూ 60 ఏళ్ల వచ్చేసరికి మతిమరుపు పెరుగుతుందన్నారు. వృద్ధాప్యంలోనూ చురుగ్గా జీవించాలన్నారు. యువత, సామాన్యులు వృద్ధులకు సాయం చేసే దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. జిల్లా ఆసుపత్రి బాధ్యుడు డా.ఎన్.బసరెడ్డి మాట్లాడుతూ నిత్యం పనులతో మెదడు శక్తి తగ్గుముఖం పట్టుతుంది. ఒత్తిడి లేని జీవితం సాగించాలన్నారు. వైద్యులు వీరేంద్రకుమార్, మరియం బీ, అబ్బుల్లా, పుర్షోతమకృష్ణమని, హనుమంతప్ప, విశ్వనాథ, యోగానంద రెడ్డి, రాకేశ్, నర్సింగ్ ముఖ్య పర్యవేక్షకురాలు విమలాక్షి, అధికారి ఈశ్వర్ దాసప్పనవర్ పాల్గొన్నారు.

వృద్ధులకు విలువనివ్వండి



మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ ఎ.నందగడి

హొసపేటె, న్యూస్‌టుడే: మన సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతటి విలువ ఇస్తామో, వృద్ధులకూ అంతే విలువ ఇవ్వాలి. సమాజానికి వారి మార్గదర్శనం చాలా అవసరమని జిల్లా అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ ఎ.నందగడి పేర్కొన్నారు. న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం, సమాచార, పౌరసంబంధాలు, వైద్య శాఖ, నగరసభల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరసభ సభాంగణంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏదైనా కుటుంబంలో వృద్ధులు ఉండి, మార్గదర్శనం చేస్తారో, ఆ కుటుంబం తప్పకుండా స్వర్గమే. ఆదర్శ కుటుంబానికి మారుపేరుగా నిలుస్తుందన్నారు. మరో న్యాయమూర్తి హేమలతా హుల్యాళ్ మాట్లాడుతూ నేడు ఉమ్మడి కుటుంబాల సంఖ్య బాగా తగ్గింది. కలిసిమెలిసి ఉంటేనే సుఖం..అనే నానుడిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. న్యాయమూర్తి ప్రశాంత్ నాగలాపుర మాట్లాడుతూ 2007 నుంచి మన దేశంలో వృద్ధుల సంరక్షణ చట్టం అమల్లోకి వచ్చింది. వారి హక్కులను ఈ చట్టం చెబుతుందని వివరించారు. న్యాయమూర్తి ఆశోక్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశ జనాభాలో వృద్ధుల సంఖ్య 10 శాతం, 2050కల్లా వారి సంఖ్య 20 శాతానికి చేరే అవకాశం ఉందని ఓ నివేదికలో వెల్లడైందని తెలిపారు. న్యాయమూర్తులు రమేష్‌బాబు, సంజీవ్ కుమార్, చైత్రా, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ప్రహ్లాదరావు, కార్యదర్శి నరసింహమూర్తి, నగరసభ కమిషనర్ సి.చంద్రప్ప పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు అగ్రాసనం



నగర పరిశుభ్రతపై ఏర్పాటు చేసిన జాతా

బళ్లారి, న్యూస్‌టుడే: నగర వాసులు ఆరోగ్యంగా జీవనం సాగించడానికి మనం నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఈ క్రమంలో నగర పాలికె అధికారులతో సహకరించాలని మేయర్ ముల్లంగి నందీష్ కోరారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, నగర పాలికె, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డా.రాజ్‌కుమార్ రహదారిలోని బళ్లారి మున్సిపల్ పదవి పూర్వ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించి మాట్లాడారు. నగర పాలికెలోని 39 వార్డుల్లో నివాసముంటున్న ప్రజలు ఇంట్లో నిత్యం ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను రహదారులు, మురుగు కాలువల్లో పడేయకుండా ఇంటి ముందుకు వచ్చే వాహనంలో వేయాలన్నారు. అధికారి మనీశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై అవగాహనతో అడుగు వేయాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దాదాపీర్, అబ్రహామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగర పరిశుభ్రతపై ఏర్పాటు చేసిన జాతాను మేయర్ ప్రారంభించారు.

డైట్ విద్యార్థుల స్వచ్ఛభారత్



డైట్ కళాశాల ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

బళ్లారి, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని రేడియో పార్క్‌లోని ప్రభుత్వ డైట్ విద్యార్థులు మంగళవారం కళాశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. డైట్ కళాశాలలో గాంధీ స్మారకం ఉండటంతో బుధవారం వివిధ దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు కళాశాల ఆవరణలో వ్యర్థాలను శుభ్రం చేశారు. ప్రభుత్వం ఈ నెల 14 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రధాని పిలుపు మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించాలి. అందులో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించినట్లు విద్యార్థులు తెలిపారు.

ఏడో వేతన సంఘ సిఫార్సుల అమలుకు ధర్నా



డీసీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

బళ్లారి, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగులకు ఏడో వేతన సంఘ సిఫార్సులను అమలు చేయాలని కర్ణాటక విశ్రాంత నౌకర వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎం.టి. మల్లేశ్ నేతృత్వంలో సభ్యులు మోహతాబ్, హనుమంతప్ప, చంద్రప్ప, జిలాని, యల్లప్ప తదితరులు డీసీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ఏడో వేతన సంఘం సిఫార్సుల ప్రకారం 2022 జులై 1 నుంచి 2024 జులై 31 లోపు పింఛను సంఘం ప్రకారమే పింఛన్లు వస్తున్నాయని అందించాలన్నారు. నేటి వరకు ఆరో వేతన విధానం వ్యక్తం చేశారు.

IN THE HON'BLE COURT OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR : : ANANTHAPURAMU

DRA. No. 36/2024

Between : Shriram Chits (India) Private Ltd., Anantapur - I Branch, Repd by its Manager cum G.P.A. Holder ... **DISPUTANT**

Vs

K.M.Ramakanth Rao & 4 others ... **OPPONENTS**

6) K.R.Padmavathi, W/o K.M.Ramakanth Rao, C/o U.Kesava Rao, Plot No. 223, Near I.M.A. Hall, 6th Cross, Hospet, Vijayanagara (D), Karnataka State.
7) K.R.Durga Lakshmi, D/o K.M. Ramakanth Rao, C/o U.Kesava Rao, Plot No. 223, Near I.M.A. Hall, 6th Cross, Hospet, Vijayanagara (D), Karnataka State.
8) K.R.Sravanthi, D/o K.M. Ramakanth Rao, C/o U.Kesava Rao, Plot No. 223, Near I.M.A. Hall, 6th Cross, Hospet, Vijayanagara (D), Karnataka State.

NOTICE TO OPPONENT No.6, 7, 8

డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీ మొత్తం రూ. **9,15,630/-** రాబట్టుకొనుటకుగాను మీ పైన దాఖలు చేసిన దావాలో 6,7,8వ ఆపోనెంట్స్ అయిన మీరు హాజరు అగుటకు గాను **09.10.2024**వ తేదీన వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o ది జిల్లా రిజిస్ట్రార్ (R&S), అనంతపురం వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Dy. Registrar of Chits O/o The District Registrar (R & S) Anantapuramu.

పౌష్టికాహారంతో విద్యార్థుల్లో మానసిక వికాసం

చెళ్లకెర(చిత్రదుర్గం): విద్యార్థుల మానసిక వికాసానికి పౌష్టికాహారం ముఖ్యమని హొళల్కెరె ఎమ్మెల్యే చంద్రప్ప పేర్కొన్నారు. మంగళవారం హొళల్కెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్లను తినిపించి వారం పొడుగునా గుడ్ల వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పౌష్టికాహారం అందించే కార్యక్రమం దేశంలోనే వినూత్నమైందన్నారు.



విద్యార్థులకు గుడ్ల వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన హొళల్కెరె ఎమ్మెల్యే చంద్రప్ప



పట్టణంలో ప్ల కార్డులు పట్టుకుని ర్యాలీ వస్తున్న మహిళలు

జమాతే మహిళల జాగృతి ర్యాలీ

సింధనూరు, న్యూస్‌టుడే: నైతికతే స్వాతంత్ర్యపు బరోసా పేరిట నెల రోజుల అభియాన్ నిర్వహించిన సింధనూరు జమాతే మహిళా విభాగం చివరి రోజున మంగళవారం జన జాగృతి ర్యాలీ జరిపింది. భర్త మద్యానికి బానిసైతే భార్య, పిల్లలకు పస్తులే అనే నినాదంతో కూడిన ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ముస్లిం మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. షాహీ మహల్ నుంచి ఇందిరాగాంధీ స్త్రీశక్తి భవన్ వరకూ ర్యాలీ సాగించింది. అక్కడే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వక్తలు 'స్వాతంత్ర్యం మనకు ఇచ్చిన ఇందుకేనా' అనే అంశంపై చర్చించారు.

ఉత్సవాల సిద్ధతా సమావేశం

కారటగి, న్యూస్‌టుడే: కారటగిలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయ 90వ సంవత్సర శరన్నవరాత్రి ఉత్సవాల పూర్వ సిద్ధతా సమావేశం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగింది. తహసీల్దార్ ఎం.కుమార స్వామి మాట్లాడుతూ ప్రజల సహకారంతో 10 రోజులు ఉత్సవాలు జరుగుతాయి. 11న అమ్మవారి నాడు స్వామి రథోత్సవం ఉంటుంది. ఆలయం వద్ద చేపట్టే వివిధ పనుల గురించి ఆలయ సమితి కార్యదర్శి రేవప్ప ఇన్‌స్పెక్టర్ సుదర్శనకు హిరేమఠకు సూచించారు. ఉత్సవాల నిర్వహణ విషయమై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆలయ సమితి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



ఉత్సవాల పూర్వ సిద్ధతా సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ తదితరులు

కనకగిరి పట్టణ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం

కారటగి, న్యూస్‌టుడే: కనకగిరి పట్టణ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమైంది. అధ్యక్ష స్థానం బీసీ 'ఎ' కు, ఉపాధ్యక్ష స్థానం గిరిజన (ఎస్‌టీ)కి కేటాయించారు. అధ్యక్ష స్థానానికి కాంగ్రెస్ నుంచి ఒకటో వార్డు సభ్యురాలు హుసేనబీ, ఉపాధ్యక్ష స్థానానికి అయిదో వార్డు సభ్యుడు కంఠెప్ప నాయక్ మాత్రం నామపత్రాలు సమర్పించడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వ్యవహరించిన తహసీల్దార్ విశ్వనాథ మురడి ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులు కె.గంగాధర స్వామి, రెడ్డి శ్రీనివాస్, వీరేశ్ సమగండి, సిద్ధప్ప నీరలూటి, పట్టణ పంచాయతీ సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు.



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పట్టణ పంచాయతీ సభ్యులు తదితరులు

IN THE HON'BLE COURT OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR :: ANANTHAPURAMU

DRA. No. 86/2024

Between : Shriram Chits (India) Pvt. Ltd., Anantapur-1 Branch, Repd by its Manager cum G.P.A. Holder. **- DISPUTANT**

Vs

K.Shivaputrappa & 2 others **- OPPONENTS**

1) K.Shiva Puthrappa, S/o K.Yerriswamy, Police Constable, KGID No/Metal No. 2306048, CPC.307, Kudithini Police Station, Bellary, Karnataka State, R/o D.No. 523, Ward No. 21, Basaveswara Nagar, Kampli, Bellary, Karnataka State.
2) H.Manjunatha, S/o H.Yerriswamy, Police Constable, CPC.386, Naguru Police Station, Mangalore, Karnataka State, R/o. 21st Ward, Basaveswara Nagar, Kampli, Bellary, Karnataka State.
3) K.Vasanth Kumar, S/o K.Marenna, Line Mechanic Grade-II, EMP. Code : 0918, O/o GESCOM, Emmiganur, Kurnool (D), R/o D.No. 6/701, Venkateswara Talkies, Endugade, 6th Ward, Kampli, Hospet, Bellary, Karnataka State.

NOTICE TO OPPONENTS No. 1 to 3

డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీ మొత్తం రూ. 2,06,120/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన దావాలో 1 నుండి 3 ఆపోనెంట్స్ అయిన మీరు హాజరు అగుటకు గాను 9.10.2024వ తేదీన వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o ది జిల్లా రిజిస్ట్రార్ (ఆర్ & ఎస్), అనంతపురం వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By Order of Deputy Registrar of Chits, O/o. The District Registrar (R&S), Anantapuramu.

తెరపై ఈనాడు

ఉమ- సంజు (కన్నడ), **గంగా-** భీమ (కన్నడ), **శివ-** సత్యం సుందరం (తెలుగు)
నటరాజ్: జోకర్ (ఆంగ్లం), **రాధిక-** దేవర (తెలుగు), **రాఘవేంద్ర-** దేవర(తెలుగు)
మూవీటైమ్ మాల్ స్క్రీన్1- దేవర (కన్నడ)
స్క్రీన్2- దేవర (హిందీ),
స్క్రీన్3- దేవర (తెలుగు)

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

01-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.95	1617.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8277	1220
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,177	9,791
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.578	55.737

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

పంచాయతీ అభివృద్ధి అధికారుల నిరవధిక నిరసన



నిరవధిక నిరసన గోడపత్రికను విడుదల చేస్తున్న సంఘం ప్రముఖులు

హొసపేటె, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి (పి.డి.ఒ.), కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్ సహా డి గ్రూపు ఉద్యోగుల పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న బెంగళూరులో స్వాతంత్ర్య ఉద్యానవనంలో నిరవధిక నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమాఖ్య విజయనగర జిల్లాధ్యక్షుడు ఎమ్.చంద్రానాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 6,021 మంది పీడీవోలు విధులు నిర్వహిస్తున్నారు. పీడీవో ఉద్యోగ స్థానాలను ఏర్పాటు చేసి సుమారు పదిహేనేళ్లు అయింది. ఇప్పటి వరకు వారికి పదోన్నతి కల్పించలేదని వాపోయారు. తమను బీ శ్రేణి ఉద్యోగులుగా పరిగణించాలని కోరాం. ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని విచారం వ్యక్తం చేశారు. ఖాళీ ఆయన స్థానాలను భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపైనే ఒత్తిడి పెరిగిపోయిందని ప్రముఖులు ఉమేశ్ జాగీర్‌దార్, కవిత, లింగప్ప, శశిధర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల రక్షణకు కృషి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల రక్షణకు కార్మిక శాఖ కృషి చేస్తుందని ఆ శాఖ అధికారి సిద్ధప్ప జి.ఖైరూరు పేర్కొన్నారు. పట్టణంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం వివిధ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులకు ఒక రోజు శిక్షణ శిబిరాన్ని ఇతర అతిథులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసంఘటిత, సంఘటిత రంగాల్లో ఉన్న కార్మికుల హక్కుల రక్షణ, వారికి బీమా సౌలభ్యం, మహిళా కార్మికులకు లభించాల్సిన సౌకర్యాలు, పనికి తగ్గ జీతం వంటి విషయాల్లో కార్మికులకు అన్యాయం జరిగితే తమ శాఖలో ఫిర్యాదు చేస్తే పరిశీలించి న్యాయం చేకూరుస్తామన్నారు. కార్మికుల హక్కులు, చట్టాలు గురించి శిబిరంలో తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు యు.వెంకోబ, ఉపాధ్యక్షుడు షరీఫ్‌సాబ్, న్యాయవాదులు వెంకటేశ్ నాయక్, మహేశ్, కార్మిక శాఖ, ఇతర శాఖల అధికారులు, మంజునాథ, తిరుమలేశ్, మౌనేశ్ పాల్గొన్నారు.



కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, న్యాయవాదులు

బాలిక బలవన్మరణం

కలబురగి, న్యూస్‌టుడే : అత్యాచారానికి గురైన ఓ బాలిక (17) చివరికి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కళాశాల నుంచి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో తన ఈడు బాలుడు ఆమెపై రెండు వారాల కిందట అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదుతో బాలుడ్ని అదుపులోకి తీసుకుని. . రిమాండ్ హోమ్‌కు తరలించారు. నాటి నుంచి వ్యథకు గురైన బాధితురాలు తన నివాసంలో మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. చించోళి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన కాపలాదారు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తాను పని చేస్తున్న అకౌంటెంట్ కార్యాలయంలో నగలు దొంగిలించిన ఆరోపణలపై నారాయణస్వామి (34) అనే కాపలాదారును సిద్ధాపుర ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దొంగిలించిన నగలతో కొనుగోలు చేసిన రూ.10.95 లక్షల విలువైన కారును జప్తు చేశారు. దాంతో పాటు ఉంగరం, బ్రేస్‌లెట్, ఖరీదైన చరవాణి, గడియారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారు డిక్కీలో దాచి పెట్టిన రూ.3.5 లక్షల నగదు గుర్తించారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

వాహనచోరుల అరెస్టు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : నకిలీ తాళాలు ఉపయోగించి, వాహనాలను దొంగిలిస్తున్న శహబాజ్, ఓం అనే ఇద్దరు చోరులను పరప్పన అగ్రహార ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12.75 లక్షల విలువైన 13 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వాహనాలను విక్రయించే ప్రయత్నంలో వీరు దొరికిపోయారు.

పాతకక్షలతో రౌడీలపై దాడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని రౌడీలపై దాడి చేసి, హత్యాయత్నం చేసి పరారైన ఆరుగురిని రాజగోపాలనగర ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. రమేశ్, తేజస్, మంజునాథ్, అరుణ్, దీక్షిత్, సాకేత్‌లను నిందితులుగా గుర్తించారు. నందినిలేఅవుట్ ఠాణాలో రౌడీషీట్లు ఉన్న నరేంద్ర, విక్రమ్, నరేంద్ర అలియాస్ శివు, దర్శన్, భరత్‌లపై వీరు గత నెల 26న రాత్రి మారణాయుధాలతో దాడి చేశారు. గస్తీ పోలీసులు అక్కడకు రావడంతో నిందితులు పరారయ్యారు. గాయపడిన బాధితులను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, ప్రాణాపాయం తప్పింది. నిందితులను అరెస్టు చేసిన పోలీసు బృందాన్ని నగర పోలీసు కమిషనర్ అభినందించారు.

ఇళ్ల దొంగలకు కటకటాలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న ఇసైరాజ్, రామ్‌కుమార్ అనే నిందితులను బాగలూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.31.09 లక్షల విలువైన ఆభరణాలను జప్తు చేసుకున్నారు. బాగలూరు, యలహంక న్యూటౌన్ ఠాణాల పరిధిలో మూడు చోట్ల దొంగతనాలు చేశారు. తాము దొంగిలించిన సొత్తును కోయంబత్తూరులోని ఒక స్నేహితుని ఇంట్లో దాచి పెట్టారు. అక్కడకు వెళ్లిన పోలీసులు నగలు స్వాధీనం చేసుకున్నారు.



బెళగావిలో 1924లో నిర్వహించిన కాంగ్రెస్ ప్లీనరీకి మహాత్ముడు హాజరైన అపూర్వ ఘట్టం



యశ్వంతపుర రైల్వేస్టేషన్లో తొలిసారిగా అడుగిడిన వేళ.. జనం సాదర స్వాగతం




మహాత్ముడికి ఆతిథ్యమిచ్చిన బాలబ్రూయి అతిథి గృహం.. నేటికీ చెక్కుచెదరని నిర్మాణం



బాపూజీ ఆలోచనల ప్రతిరూపం.. భారతీయ విజ్ఞాన సంస్థ

గాంధేయమే.. చైతన్య గంధం



బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మహాత్ముడంటేనే కన్నడనాట ఓ చైతన్య కెరటాన్ని తలపిస్తారు! స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆయన నడయాడిన భూమిని చైతన్య వేదికలుగా మార్చిన ఘనత కన్నడిగులదే. ఆ క్రమంలోనే ఈసారి గాంధీ జయంతిని మరింత అర్థవంతంగా నిర్వహించడానికి వీలుగా ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సరిగ్గా వందేళ్ల కిందట.. 1924లో బెళగావిలో నిర్వహించిన 'కాంగ్రెస్ ప్లీనరీ' సమావేశాలకు బాపూజీ హాజరైన నేపథ్యాన్ని ఎంచుకుని స్వచ్ఛ సంకల్పం, జనచైతన్య కార్యక్రమాలకు నేతలు ముందడుగు వేస్తున్నారు. 'వందేమాతరం..' గీతం ఆలపించిన మొదటి సమావేశం ఇదే కావడంతో వేడుకలను అర్థవంతంగా- ఏడాది పొడవునా నిర్వహిస్తామని పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. మహాత్ముడితో పాటు జాతి నేతలు జవహర్‌లాల్ నెహ్రూ, లాలాలజపతి రాయ్, రాజగోపాలాచారి, డాక్టర్ అనిబిసెంట్, సరోజినీ నాయుడు, మదన్ మోహన్ మాళవియ, పటేల్, రామస్వామి అయ్యార్ తదితరులు ఆ సమావేశాల్లో పాల్గొన్న క్రమంలో వారందరి భావాల ప్రచారాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు.

● మహాత్ముడికి కన్నడనాడుతో ఎనలేని అనుబంధం ఉంది. ఆయన ప్రసంగాలతో వందలాది మందిని ఉద్యమబాట పట్టించారు. పోరాట యోధులను తీర్చిదిద్దారు. పోరాటంతో పాటు జన చైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మద్య వ్యతిరేక ఉద్యమానికి పిలుపునిచ్చారు. మహిళా విద్య అవసరాన్ని తన పర్యటనల్లో ప్రచారం చేశారు. స్వదేశీ వస్తు వినియోగాన్ని ప్రోత్సహించారు. బెంగళూరు హెబ్బాళ్‌లో ప్రస్తుతం ఉన్న పశువైద్య కళాశాల ఉన్న ప్రదేశంలో 'రాయల్ ఇండియా పాడి పరిశ్రమ సంస్థ' ఉండేది. ఆ కేంద్రాన్ని బాపూజీ సందర్శించాక పాడిపరిశ్రమను ప్రోత్సహించాలని నేతలకు పిలుపునిచ్చారు. బెంగళూరులోని భారతీయ విజ్ఞాన సంస్థ, లాల్‌బాగ్ ఉద్యానవనం, కెంగేరి ప్రాంతాలనూ బాపూ సందర్శించిన జ్ఞాపకాలు నేటికీ సంరక్షిస్తున్నారు. నాటి మైసూరు రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి పునాదులు వేశారు. సతీమణి కస్తూరిబాతో కలిసి 1915మే 8న నగరానికి రైల్లో వచ్చిన నాటి పర్యటన ప్రాంతాల్లో నేడు స్మారకాలు రూపుదాల్చాయి. అందులో బాలబ్రూయి అతిథిగృహం నేటికీ విరాజిల్లుతోంది.



డాక్టర్ సీవీరామన్‌తో కలసి భారతీయ విజ్ఞాన సంస్థను సందర్శించిన వేళ..

'స్వచ్ఛ' లాంఛనం ప్రదర్శన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మహాత్ముని 155వ జయంతి నేపథ్యంలో బెంగళూరులోని ఓ మాల్‌లో భారీ స్థాయిలో స్వచ్ఛ భారత్ లాంఛనాన్ని మంగళవారం ప్రదర్శించారు. దీని కోసం తీర ప్రాంత జిల్లాల నుంచి సేకరించిన 30 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించి 4500 చ.అడుగు విస్తీర్ణంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. సీఐఐ 11 యంగ్ ఇండియన్స్ సంస్థ ఈ వ్యర్థాలను సేకరించింది. స్వచ్ఛభారత్ జాగృతి కోసం నిర్వహించిన కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు మహ్మద్ జఫ్రిన్, పూజితా ప్రసాద్, సంగీత, సిద్ధార్థ్ కృష్ణకుమార్, హరీశ్ శెణై, సునీల్ మున్షి, కళాకారుడు మహ్మద్ మహర్ అహ్మద్ పాల్గొన్నారు.



స్మారక భవన వైభవం

గాంధీభవన్.. ఈ పేరు చెబితేనే బెంగళూరు నగర శేషాద్రిపుర నుంచి కుమారకృప అతిథి గృహం దిశగా సాగే మార్గం గుర్తొస్తుంది. మహాత్ముడు నగరాన్ని సందర్శించిన వేళ.. కాసేపు విశ్రమించి, పదుగురితో చర్చించడానికి ఎంచుకున్న ఆ ప్రాంతంలో నేడొక భవంతి వెలసింది. దానిపేరే.. 'గాంధీభవన్'! నేడు సర్వధర్మ సమావేశాలు, అభ్యుదయ భావజాల చర్చలు, గాంధీ స్మారక సభలు, రైతుల సమాలోచనలకు నిలయమది!



గాంధీ తాత కళ్లజోడు ఆకారంలో ప్లాస్టిక్ వ్యర్థాలు



కుమారకృప మార్గంలోనే నేడొక సుందర స్మారకాన్ని చూడొచ్చు. అక్కడి ఓ చెట్టుకింద ఆసీనులై.. సర్వజన సమావేశాల్లో గాంధీజీ ప్రసంగించేవారు. ఆ సమీప ప్రాంతమంతా హోటల్ అశోక్ యాజమాన్య సొంతం. బాపూజీపై గౌరవంతో ఆయన ఆసీనులైన చెట్టు వద్ద స్మారకం నిర్మించి.. పరిరక్షిస్తున్నారు. తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఆ చిరు మందిరాన్ని ప్రారంభించారు.

కుంట నీటిలో మునిగి ఇద్దరు బాలికల మృతి

దావణగెరె, న్యూస్‌టుడే : జగళూరు తాలూకా అసగోడు వడ్డరహట్టి గ్రామంలో నీటి కుంటలో పడి గంగోత్రి (10), తనుశ్రీ (11) అనే బాలికలు మరణించారు. సోమవారం సాయంత్రం బడి వదిలిన అనంతరం నలుగురు స్నేహితురాళ్లు పొలంలోని కుంట వద్దకు వెళ్లారు. అక్కడ ఆడుకుంటున్న సమయంలో ఒక బాలిక కాలుజారి నీటిలో పడింది. ఆమెను రక్షించే ప్రయత్నంలో మరో బాలిక నీటిలో పడి మునిగి పోయిందని గుర్తించారు. బాలికలను రక్షించేలోగా ఇద్దరూ మరణించారు. జగళూరు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : వడ్డీ చెల్లించే అంశంలో జరిగిన గొడవలో గంగాధరనగరకు చెందిన వినాయక రోణ (28) అనే యువకునిపై కొందరు దాడికి దిగారు. గణేశ సిద్ధాపుర, అభిషేక రామగేరి, యల్లప్ప, వరుణ భజంత్రి, మణికంత, నాగరాజ, తిలక్ అనే వ్యక్తులు దాడి చేశారని బాధితుడు ఆరోపించారు. గణేశ వద్ద తీసుకున్న రుణానికి ప్రతినెలా తాను రూ.5 వేలు వడ్డీ చెల్లిస్తూ వస్తున్నా, ఉద్దేశపూర్వకంగా గొడవ పెట్టుకుని దాడి చేశారని బాధితుడు ఆరోపించాడు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడ్ని బెండిగేరి ఠాణా పోలీసులతో పాటు డీసీపీ మహాలింగ నందగావి పరామర్శించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

టైరు పేలి చోదకుడి మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: పంక్చరైన లారీ టైరులో గాలినింపుతున్న సమయంలో అది పేలి నాగరాజ్(40) అనే ట్రాక్టర్ చోదకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి హొసపేటె తాలూకా హళేమలపన గుడిలో జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ చోదకుడు నాగరాజ్ పంక్చరైన లారీ టైరును ట్రాక్టర్‌లో వేసుకుని హొసమలపన గుడిలో పంక్చర్ వేయించారు. టైరుకు గాలి నింపే సమయంలో అది పేలింది. ముఖం, ఛాతీపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిపై హొసపేటె గ్రామీణ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మరింత తరిగిపోయిన తుంగభద్ర ప్రవాహం

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్రకు వస్తున్న ఇన్‌ఫ్లో బాగా తగ్గింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పూర్తిగా ఆగడంతో జలాశయానికి 8277 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. రాయచూరు, కొప్పళ జిల్లాలను తడిపే ఎడమ కాలువ, బళ్లారి, కర్నూలు, కడప జిల్లాలకు పారే కుడి దిగువ కాలువ (ఎల్లెల్సీ), బళ్లారి, అనంతపురం జిల్లాలను తడిపే కుడి ఎగువ కాలువ(హెచ్చెల్సీ)లు కలిపి మొత్తం 10,177 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి బయటకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో తగ్గి, అవుట్‌ఫ్లో పెరగడంతో మంగళవారం నుంచి జలాశయంలో నిల్వ ఉన్న జలాల నుంచి తరుగుదల ప్రారంభమైంది. ఈ నీటి సంవత్సరంలో జలాశయం రెండుసార్లు భర్తీకావడం ప్రత్యేకం. 19వ గేటు కొట్టుకుపోవటానికి ముందు ఒకసారి, గేటు స్థానంలో స్టాప్‌లాగ్‌లను అమర్చిన తరువాత మరోసారి జలాశయం పూర్తిగా నిండింది. అక్టోబరు, నవంబరు నెలల్లో మరోసారి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని డ్యాం ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 101.578 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి.

కించపరిచే మాటలపై గళమెత్తిన 'దళం'



జనతాదళ్ కార్యాలయం వద్ద ఆందోళనకారులు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని అనుచిత పదజాలంతో దూషించిన ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని జనతాదళ్ డిమాండు చేసింది. దళ్ ప్రధాన కార్యాలయం వద్ద పార్టీ నాయకులు మంగళవారం ధర్నాకు దిగారు. పార్టీ బెంగళూరు నగర శాఖ అధ్యక్షుడు రమేశ్ గౌడ, ఎమ్మెల్సీలు జవరాయిగౌడ, టీఏ శరవణ నేతృత్వంలో కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. అక్కడి నుంచి లోకాయుక్త కార్యాలయం వైపు వెళుతున్న ఆందోళనకారులను అదుపులోనికి తీసుకుని బస్సులోకి ఎక్కించి తరలించారు. కొంత సమయం అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.



అదుపులోకి తీసుకుని తరలించేవేళ నినాదాల జోరు



బెంగళూరు విపణిలో పండ్లు, కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్– కిలో..రూ.లలో)

● బీన్స్-	55
● క్యారెట్-	70
● బీరకాయలు-	40
● క్యాబేజి-	20
● కాలిఫ్లవర్ (ఒక్కోటి)-	25
● సొరకాయ-	35
● దొండకాయలు-	40
● పొట్లకాయ-	35
● టమాటా(నాటు)-	60
● టమాటా-	50
● గుమ్మడి-	40
● ఆలుగడ్డ-	40
● ఉల్లిగడ్డలు(మేలురకం)-	70
● ఉల్లిగడ్డలు(సాధారణం)-	50
● తెల్లగడ్డలు-	390
● సాంబారు ఉల్లి-	120
● బీట్‌రూట్-	25
● వంకాయలు-	35
● బెండకాయలు-	40
● ముల్లంగి-	40
● నిమ్మకాయ-	200
● వాషింగ్టన్ ఆపిల్ :	305
● సిమ్లా ఆపిల్-	140
● గ్రీన్ ఆపిల్-	320
● అరటి కాయలు-	45
● సపోటా-	55
● పైనాపిల్-	40
● బొప్పాయి-	44
● ఆరంజి-	90
● బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

రైల్వే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : రైలు ప్రమాదం సంభవించినప్పుడు ప్రయాణికులను వేగంగా రక్షించడం, వైద్య సహాయాన్ని అందించే ప్రక్రియలపై రైల్వే పోలీసు ఫోర్స్, జాతీయ విపత్తు నిర్వహణ దళాలకు శిక్షణ ఇచ్చేందుకు నైరుతి రైల్వే మంగళవారం ప్రత్యేక ప్రదర్శన (మాక్ డ్రిల్) నిర్వహించింది. మైసూరు రోడ్డు రామోహళ్లి సమీపంలోని టన్నెల్ బ్రిడ్జ్ వద్ద అభ్యాసం కోసం బొమ్మ మనుషులను వినియోగించారు. గంటకు పైగా నిర్వహించిన అభ్యాసంలో వందకు పైగా సిబ్బంది పాల్గొన్నారు.



సొరంగ మార్గం వద్ద సహాయక చర్యలు



రక్షణ చర్యల్లో రైల్వే పోలీసులు, భద్రత సిబ్బంది

లేఖపై అభ్యంతరం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కించపరిచేలా ఓ లేఖలో ప్రస్తావించిన ఏడీజీపీ ఎం. చంద్రశేఖర్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం ఇక్కడ జేడీఎస్ నేతలు, డీజీపీ డాక్టర్ అలోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర మంత్రిని ఉద్దేశించి అసభ్యకరమైన- కించపరిచే విధంగా లేఖలో ప్రస్తావించారని జేడీఎస్ నగర అధ్యక్షుడు రమేశ్‌గౌడ ఆరోపించారు. కేంద్ర మంత్రి అనే మర్యాద లేకుండా కించపరిచిన ఏడీజీపీకి వ్యతిరేకంగా కఠిన చర్య తీసుకోవాలని డిమాండు చేశారు.



డీజీపీ అలోక్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న జేడీఎస్ నేతలు

'జంగ్లీ' ముఠా కటకటాలపాలు



నిందితుల నుంచి జప్తు చేసుకున్న చోరీ సొత్తు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ముఖానికి మంకీ క్యాప్, చేతులకు గ్లౌజులు వేసుకుని, ఇళ్లలోకి ప్రవేశించి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడి పరారవుతున్న జంగ్లీ ముఠాను రాజరాజేశ్వరినగర ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జైదీప్ అలియాస్ జంగ్లి, అతని అనుచరులు చందన్, సతీశ్, దీపక్, మిథున్‌లను నిందితులుగా గుర్తించారు. నిందితుల నుంచి రూ.10.18 లక్షల విలువైన ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన బైకులపై తిరుగుతూ దొంగతనాలకు పాల్పడేవారని పోలీసులు తెలిపారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల నియామకాలను త్వరగా పూర్తి చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించడం, శిష్యవేతనాలను సకాలంలో విడుదల చేయడం, బోధకుల నియామకం తదితర డిమాండ్లతో ఏఐడీఎస్‌ఓ కార్యకర్తలు స్థానిక ఫ్రీడంపార్కులో మంగళవారం ధర్నాకు దిగారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలు ఆడుతోందంటూ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు ఆక్రోశించారు.



ధర్నాలో విద్యార్థి సమాఖ్య ప్రతినిధులు

పూల సుగంధం



మైసూరు దసరా సంబరాలకు ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల కోసమే ఈసారి ప్రత్యేకంగా ఫల, పుష్ప ప్రదర్శన సిద్ధం చేస్తున్నారు. రాచనగరిలోని గాజుమందిరం (గ్లాస్ హౌస్)లో వివిధ రకాల అలంకరణలను శరవేగంగా పూర్తి చేస్తున్న కార్మికులను చిత్రంలో చూడొచ్చు.

- న్యూస్‌టుడే, మైసూరు

లారీని ఢీకొన్న కారు.. ఇద్దరి దుర్మరణం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హిరియూరు పట్టణ సమీపంలోని పుణె-బెంగళూరు జాతీయ రహదారిలో చోదకుని నిర్లక్ష్యంతో కారు ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొనడంతో హొసపేటకు చెందిన పారిశ్రామికవేత్త సిద్ధలింగస్వామి(58), ఆయన తల్లి తాయి జగన్మాతే (78) దుర్మరణం చెందారు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగిందని పోలీసులు తెలిపారు. బెంగళూరు నుంచి హొసపేట వైపు బయలుదేరిన కారు హిరియూరు వద్ద లారీని ఢీకొంది. ఈఘటనలో కారును నడుపుతున్న సిద్ధలింగస్వామి ప్రమాద స్థలం వద్దనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన తాయి జగన్మాతెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. హిరియూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.



హిరియూరు వద్ద లారీని ఢీకొని నుజ్జయిన కారు ముందు భాగం

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

వంద మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులతో ప్రముఖులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : యూత్ రెడ్‌క్రాస్, జయమహల్ లయన్స్‌క్లబ్, బెంగళూరు నగర విశ్వవిద్యాలయం, రాష్ట్రీయ స్వయం సేవ యోజన-ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వంద మంది విద్యార్థులు రక్తదానం చేశారు. మంగళవారం సెంట్రల్ కాలేజీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య లింగ రాజగాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ టి.జవరేగౌడ, ఎన్.ఎస్.ఎస్ సంచాలకుడు గోవిందేగౌడ, లయన్స్ రక్తనిధి వ్యవస్థాపకుడు దీపక్, బ్రిటన్ విశ్వవిద్యాలయం మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎండలోనే దివ్యాంగుల పడిగాపులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రవీంద్ర కళాక్షేత్రంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఉచితంగా మూడు చక్రాల వాహనాలను ఇచ్చేందుకు కొందరు దివ్యాంగులను అధికారులు ఎంపిక చేశారు. వారికి కేటాయించిన వాహనాల వద్ద వారిని నిలబెట్టారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కార్యక్రమానికి గంట ఆలస్యంగా హాజరయ్యారు. అప్పటి వరకు వారు ఎండలోనే తమకు కేటాయించిన వాహనాల వద్ద ఉండాల్సి వచ్చింది. ఎండ తగలకుండా ఏర్పాట్లు చేసి ఉంటే ఇబ్బంది పడి ఉండేవారిమి కాదని దివ్యాంగులు పేర్కొన్నారు.



ఎండ తీవ్రతకు తలపై దస్త్రం, అట్టపెట్టెను పెట్టుకున్న దివ్యాంగులు

హోసూరు కబుర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వేపనహళ్లి ఎమ్మెల్యే మునిస్వామి

కుటుంబ రక్షణకే ఉప ముఖ్యమంత్రి పదవి

హోసూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి స్టాలిన్ తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి తన కుమారుడికి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారని ఏఐఏడీఎంకే సీనియర్ నాయకుడు, వేపనహళ్లి ఎమ్మెల్యే కె.పి.మునిస్వామి ఆరోపించారు. హోసూరు సమీపం శూలగిరిలో డీఎంకే ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళన చేశారు. హోసూరు, శూలగిరి, వేపనహళ్ళి, కృష్ణగిరి, బర్గూరు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ శూలగిరి ప్రాంతంలో విద్యుత్తు సరఫరా సరిగా లేక రైతులు, పరిశ్రమలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ధ్వజమెత్తారు. రైతులు వ్యవసాయం చేయడానికి వీలుకాక నష్టాలకు గురవుతున్నారన్నారు. జైలు నుంచి బయటికి వచ్చిన మాజీ మంత్రి శెందిల్ బాలాజీకి మళ్లీ మంత్రి పదవి ఇచ్చారని, గతంలో అతడు చూసిన శాఖనే కేటాయించడం వెనుక ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఊత్తంగరై ఎమ్మెల్యే తమిజ్‌శెల్వన్, నాయకులు అశోక్‌కుమార్, సీకనపల్లి బాబు వెంకటాచలం, బాలసుబ్రమణ్యం, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ఏఐఏడీఎంకే కార్యకర్తలు

అదనపు తరగతి గదులు ప్రారంభం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు తాలూకా నూనపల్లి గ్రామ పంచాయతీ చిన్నబేళగొండపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టైటాన్ యాజమాన్యం రూ.29 లక్షలతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను కలెక్టర్ సరయు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు సీఎస్ఆర్ నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్ ప్రియాంక, పరిశ్రమ డైరెక్టర్ శ్రీధర్, డివిజనల్ మేనేజర్ హరిహర సుబ్రహ్మణ్యం, బీడీఓ బాలాజీ, శాంతలక్ష్మి, పూనపల్లి పంచాయతీ అధ్యక్షురాలు సావిత్రమ్మ బైరప్ప, పోషక ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ చిన్నస్వామి, ఎమ్మెల్యే సోదరుడు వై.చంద్రయ్య, ఇంజినీరు శ్యామల, విమల, ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



తరగతి గదులను ప్రారంభిస్తున్న కలెక్టర్ సరయు, ప్రియాంక, సావిత్రమ్మ

జిల్లా ప్రధాన విద్యాధికారి మహేశ్వరికి పదోన్నతి

హోసూరు, న్యూస్‌టుడే : కృష్ణగిరి జిల్లా ప్రధాన విద్యాధికారి కె.పి.మహేశ్వరి విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈమె హయాంలో చాలా పాఠశాలల్లో వందశాతం ఫలితాలు వచ్చాయి. ప్రత్యేక చర్యల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. ప్రాథమిక పాఠశాలల విద్యాధికారిగా పనిచేస్తున్న మునిరాజుకు సీఈఓగా బాధ్యతలు అప్పగించారు.

బ్యాంక్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరులోని ఎస్‌బీఐ బీమా విభాగంలో పనిచేస్తున్న రాజకుమార్ (29) ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందారు. కడలూరు జిల్లాకు చెందిన ఇతడు సదాశివం నగరులో అద్దె ఇంట్లో ఉండేవారు. తల్లి జ్యోతిలక్ష్మి ఫోను చేయగా రాజ్‌కుమార్ స్పందించకపోవడంతో ఆమె భయపడి హడ్కో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటికి వెళ్లి తలుపులు పగుల గొట్టి చూడగా రాజ్‌కుమార్ శవమై పడిఉన్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిపై అనుమానం ఉందని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

4 నుంచి నగల ప్రదర్శన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దసరా, దీపావళి పండగలతో పాటు పెళ్లిళ్ల సీజన్ రావడంతో అన్ని బంగారు నగలు, వజ్రాభరణాలను ఒక దగ్గర ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈనెల 4 నుంచి ఆరో తేదీ వరకు నగరంలోని వసంతనగర శాంగ్రిలా హోటల్‌లో ఆసియా వెడ్డింగ్ షో-2024 ప్రదర్శన ప్రారంభం కానుంది. బంగారు నగలు, వజ్రాభరణాల డిజైన్లు, ప్రాచీన నగల నమూనాలు తదితర వాటిని ప్రదర్శనలో ఉంచుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలోని అన్ని బంగారు నగలు, వజ్రాభరణాలను ఒక దగ్గర ప్రజలు తిలకించి కొనుగోలు చేసేందుకు ప్రదర్శన అనుకూలంగా ఉంటుందని తెలిపారు.



దేశీయ బంగారు నగలు ధరించిన రూపదర్శిని

నగరంలో ఊపందుకున్న స్వచ్ఛత పనులు



శ్రీరాంపురంలో ఫాగింగ్ చేస్తున్న పాలికె సిబ్బంది

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పాలికె అధికారులు, సిబ్బంది పెద్దఎత్తున చేపట్టి స్వచ్ఛత పనులు చేపట్టారు. ఉద్యానవనాలను శుభ్రం చేసి చెత్తను పోగు చేశారు. పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ సంచులు తొలగించారు. రహదారులు, పాదచారి మార్గాలను శుభ్రం చేశారు. చెత్త పోగు చేసి సంచులకు ఎత్తారు. పోగు చేసిన చెత్త సంచులను వాహనాల్లో తరలించారు. మహదేవపుర, మారతహళ్లి, కుందనహళ్లి, దొడ్డనక్కుండి, సర్జాపుర, బెళ్లందూరు తదితర ప్రాంతాల్లో స్వచ్ఛత పనులు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు సోకవని, పరిసరాలు బాగుంటే ఆరోగ్యాలు బాగుంటాయని అధికారులు తెలిపారు. నగరానికి చెత్త పెద్దశత్రువుగా మారిందని, చెత్త నిర్మూలన, పరిసరాల శుభ్రత మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని సూచించారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయవద్దన్నారు. ఇంటి వద్దకు వచ్చే చెత్తసేకరించే వాహనాల్లో చెత్తను వేయాలన్నారు. డెంగ్ వంటి విషజ్వరాల నియంత్రణకు కోసం మల్లేశ్వరం, శ్రీరాంపుర, సరస్వతిపుర, రామచంద్రపుర తదితర ప్రాంతాల్లో పాలికె సిబ్బంది ఫాగింగ్ చేశారు. రసాయనిక మందులను పిచికారి చేశారు. పాలికె అధికారుల పర్యవేక్షణలో స్వచ్ఛత, ఫాగింగ్, పిచికారి పనులను పర్యవేక్షించారు.



చెత్త ఊడ్చుతున్న పాలికె అధికారులు



పోగు చేసిన చెత్తను తరలిస్తున్న కార్మికులు

నగరంలో ఈనాడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :

- ఉదయం 9 గంటలకు గాంధీ భవన్ నుంచి విధానసౌధ వరకు చేపట్టే పాదయాత్రను ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రారంభిస్తారు.
- ఉదయం 9 గంటలకు ఎంజీ రోడ్డు మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పాలికె ఆధ్వర్యంలో సర్వధర్మ ప్రార్థనలు నిర్వహిస్తారు. పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తదితరులు పాల్గొంటారు.
- ఉదయం 10 గంటలకు విధానసౌధలోని బ్యాంక్వెట్ హాల్లో మహాత్మగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొంటారు.
- ఉదయం 10.30 గంటలకు గాంధీభవన్‌లో మహాత్మగాంధీ జయంతి సందర్భంగా ప్రపంచ అహింస దినోత్సవాన్ని నిర్వహిస్తారు.
- ఉదయం 10.30 గంటలకు కుమారకృపా రోడ్డులోని కర్ణాటక చిత్రకళా పరిషత్తులో హస్త కళా వస్తు ప్రదర్శన కొనసాగుతుంది.
- ఉదయం 11 గంటలకు కబ్బన్‌పార్క్ మెట్రోస్టేషన్ వద్ద హస్తకళా వస్తు ప్రదర్శనను సృష్టి మణిపాల్ సంస్థ ప్రారంభం చేయనుంది.
- మధ్యాహ్నం 3.30 గంటలకు విధానసౌధ సులోచనా సమావేశ మందిరంలో మహాత్మగాంధీ సేవా పురస్కారం-2024, టీఎస్ఆర్, మోహారో హణమంతరాయ పత్రికోద్యమ పురస్కారాలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రదానం చేస్తారు.

రేపు దసరా క్రీడోత్సవాలు ప్రారంభం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : మైసూరు దసరా క్రీడోత్సవాలు ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్నాయని యువ సబలీకరణ, క్రీడాశాఖ సంయుక్త డైరెక్టర్, దసరా క్రీడా ఉప సమితి కార్యాధ్యక్షుడు డాక్టర్ జితేంద్రశెట్టి తెలిపారు. చాముండీ విహార్ క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య క్రీడలను ప్రారంభిస్తారన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టు నాయకుడు హర్మన్‌ప్రీత్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. జిల్లా బాధ్యమంత్రి హెచ్.సి.మహాదేవప్ప, ఎమ్మెల్యే తన్వీర్‌సేట్‌తో సహా పలువురు ప్రజా ప్రతినిధులు ప్రారంభ వేడుకల్లో పాల్గొంటారు. క్రీడోత్సవాల్లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, కుస్తీ, ఖోఖో, త్రోబాల్, దేహధారుడ్య, విలువిద్య, షూటింగ్ వంటి 26 క్రీడల్లో పోటీలు జరుగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మంగళూరు, ఉడుపి, కొడుగు, చిక్కమగళూరు, హాసన, చామరాజనగర తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారు. దసరా క్రీడలు చాముండీ విహార్ క్రీడాప్రాంగణంతో పాటు దేవరాజ అరసు కుస్తీ అకాడమీ, ఇతర ప్రాంగణాల్లో జరుగుతాయి. సమావేశంలో దసరా క్రీడాశాఖ ఉప సమితి కార్యదర్శి భాస్కర్‌నాయక్, శిక్షకుడు వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న భాస్కర్‌నాయక్, జిత్రేందశెట్టి, వసంతకుమార్



యూకే ఆచార్యులను సత్కరిస్తున్న లింగరాజగాంధీ, తదితరులు

బెంగళూరు విశ్వవిద్యాలయంలో యూకే ఆచార్యులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఓల్వర్ హ్యాంప్టన్ విశ్వవిద్యాలయం (యూకే) ఉప కులపతి ఆచార్య ప్రశాంత్‌పిళ్లై నేతృత్వంలో అక్కడి ఆచార్యుల బృందం మంగళవారం బెంగళూరు నగర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఉప కులపతి ఆచార్య లింగరాజగాంధీ అధ్యక్షతన జ్ఞాన జ్యోతి సభాప్రాంగణంలో అధ్యాపకులు, అధికారులతో ప్రగతి పరిశోధనపై చర్చించారు. గత మార్చిలో యూకే విశ్వవిద్యాలయం ఆహ్వానం మేరకు లింగరాజగాంధీ ఒల్వర్ హ్యాంప్టన్ వెళ్లారు. అక్కడ చేసుకొన్న ఒప్పందాలను మూడేళ్ల పాటు కొనసాగించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో యూకే ఆచార్యులు రాబిన్‌కారె, సుభాషహణి, పరిశోధన అధ్యాపకుడు సురేష్ రేణుకప్ప, రిజిస్ట్రార్లు జవరేగౌడ, ఆనందకుమార్, డీన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం తరపున యూకే ఆచార్యులను ఘనంగా సత్కరించారు.

రంజీ ట్రోఫీ జట్టు సారథిగా మాయాంక్ అగర్వాల్



మాయాంక్ అగర్వాల్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న కర్ణాటక జట్టుకు మాయాంక్ అగర్వాల్ కెప్టెన్‌గా ఎన్నికయ్యారు. మంగళవారం కర్ణాటక క్రికెట్ సంఘం రంజీ పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టు సభ్యులను ప్రకటించింది. ఈనెల పదకొండు నుంచి 14 వరకు మధ్యప్రదేశ్‌లో, ఈనెల 18 నుంచి 21 వరకు బెంగళూరులో ఈ పోటీలు జరుగుతాయి. జట్టు ఆటగాళ్ల వివరాలు- మనీష్‌పాండే-వైస్ కెప్టెన్, నిఖిన్‌జోస్, దేవదత్‌పడికల్, శ్రేయస్‌గోపాల్, సుజయ్‌సతేరి-వికెట్ కీపర్, హర్దిక్‌రాజ్, వి.వైశాఖ్, ప్రసిద్ధకృష్ణ, వి.కౌశిక్, లిన్విత్‌సిసోడియా-వికెట్‌కీపర్, మోయిషిన్‌ఖాన్, విద్యాధర్ పాటీల్, కిషన్ బిదిరే, అభిలాష్‌శెట్టి.

దసరా పోటీలకు ఎంపికైన ఆళ్వాస్ క్రీడాకారులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : మైసూరు దసరా క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు యువ సబలీకరణ, క్రీడాశాఖ ఆధ్వర్యంలో మంగళూరు, ఉడుపి, కొడుగు, చామరాజనగర జిల్లాల్లో నిర్వహించిన క్రీడల్లో 70 మంది ఆళ్వాస్ క్రీడాకారులు 29 పతకాలను సాధించి మైసూరు దసరా క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం ఆళ్వాస్ అధ్యక్షుడు ఎం. మోహన్ ఆళ్వా క్రీడాకారులను అభినందించారు. ఈనెల మూడు నుంచి మైసూరు చాముండీ విహార్ క్రీడాప్రాంగణంలో దసరా రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పురుష, మహిళల విభాగాల్లో అథ్లెటిక్స్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, ఖోఖో తదితర పోటీల్లో ఆళ్వాస్ క్రీడాకారులు పాల్గొంటారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

సామ్రాట్ కేబీ మధుకు డాక్టరేట్

బెంగళూరు (జాలహళ్లి) న్యూస్‌టుడే : 'మానవ సేవయే మాధవ సేవ' అని గుర్తెరిగి సేవలందిస్తున్న జన చైతన్య స్రవంతి వ్యవస్థాపకుడు, అనంతపురానికి చెందిన సామ్రాట్ కె.బి.మధుకు అమెరికన్ విస్డమ్ పీస్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. మానవ హక్కులను పరిరక్షిస్తూ ..బడుగు బలహీన వర్గాల పిల్లల జీవితాలపై అధ్యయనం, పరిశోధనలు చేసినందుకు ఆయనను డాక్టరేట్‌కు ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయం ప్రతినిధి వి.బాబు విజయన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆయన కృషి చేస్తున్నట్లు ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ శివమూర్తి, డాక్టర్ దుర్గ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ రాజు, డాక్టర్ హరిదాస్, డాక్టర్ కేశవప్రసాద్ పాల్గొన్నారు.



సామ్రాట్ మధుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

ప్రిన్సిపల్ బదిలీ ఆపాలని ఆందోళన

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని దొడ్డహళ్ళి గ్రామానికి సమీపంలోని అటల్ బిహారి వాజ్‌పేయి వసతి పాఠశాల ప్రిన్సిపల్‌ను బదిలీ చేయకూడదని మంగళవారం విద్యార్థుల పోషకులు వసతిశాల ముందు ధర్నా చేపట్టారు. రెండేళ్ల నుంచి ఈ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ కస్తూరి కుమారను వేరొక పాఠశాలకు బదిలీ చేయడంతో ఆగ్రహించిన విద్యార్థులు, పోషకులు బదిలీ చేయకూడదని డిమాండ్ చేశారు. ఆమె బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పాఠశాల, కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని, వసతిశాల నిర్వహణ బాగుందన్నారు. కస్తూరి కుమారను శిరా తాలూకా భువనహళ్ళికి బదిలీ చేయడం ఎంత వరకు సమంజసమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రిన్సిపల్ బదిలీని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎ.గోపి, చిక్కహళ్ళి దేవేంద్ర, పోషకులు ఎన్.శంకరప్ప, బలరామ, అక్కులప్ప, రాజు, ప్రభాకర, సరోజమ్మ, కృష్ణవేణి, నారాయణప్ప, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వసతి నిలయం ముందు ధర్నా చేస్తున్న పోషకులు

'ఓలా'కు చేదు అనుభవం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : క్యాబ్ డ్రైవరు చేతిలో లైంగిక దౌర్జన్యానికి గురైన యువతికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ఓలా క్యాబ్ సంస్థను కర్ణాటక ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. డ్రైవరు 2019లో ప్రయాణికురాలిపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో నిందితుడ్ని అరెస్టు చేశారు. నిందితుడికి ఇప్పటికే శిక్షను విధించిన న్యాయస్థానం.. బాధితురాలికి రూ.5 లక్షలు ఇవ్వవలసిన బాధ్యత ఓలా సంస్థపై ఉందని తన తీర్పులో మంగళవారం పేర్కొంది.

నైపుణ్య శిక్షణకు ఒప్పందాలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఇంజినీర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులకు కౌశల్యాభివృద్ధి, నైపుణ్యవృద్ధికి తమ సంస్థ ఆవరణలో శుక్రవారం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పీఈఎస్ ఆచార్య జవహర్ తెలిపారు. శిక్షణ కోసం బజాజ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. వర్సిటీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్యులు, బజాజ్ ఇంజినీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ (బెస్ట్) సంస్థ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. నైపుణ్యాభివృద్ధికి బెస్ట్ ఇప్పటికే రూ.30 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తారని ప్రకటించారు. మొదటి బ్యాచ్‌లో 60 మందికి శిక్షణ ఉంటుందని చెప్పారు. పీఈఎస్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మినహా, ఇతరులకే ఈ శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు.



ఆహ్వాన పత్రాన్ని ప్రదర్శిస్తున్న ఆచార్యులు



ప్రభుత్వాసుపత్రి ముందు వైద్యులు, సిబ్బంది

ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం

పావగడ, న్యూస్‌టుడే : ప్రపంచ హృదయం దినోత్సవాన్ని పట్టణ ప్రభుత్వాసుపత్రి ఆవరణలో తాలూకా వైద్యాధికారి కిరణ్ నేతృత్వంలో వైద్యులు, సిబ్బంది మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. పని చేయడానికి హృదయాన్ని ఉపయోగించండి అనే నినాదంతో వైద్యుడు కిరణ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ హృదయం ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్యంతో కూడిన భోజనం, మంచి అలవాట్లు, దేహదారుడ్యానికి చెందిన వ్యాయామం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి ఎ.ఎస్.ఎల్.బాబు, ఎస్‌డీసీ బృందం సిబ్బంది చంద్రకళ, ఎం.డి.ఖాసిం, ఆర్.ఓంకార్, గొల్లల్లప్ప, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి తీవ్రగాయాలు

హావేరి: వీధిలో వెళుతున్న వారిపై ఒక కోతి దాడి చేసి కరిచిన ఘటన హావేరి సమీపంలోని యత్నళ్లి తాండాలో మంగళవారం చోటు చేసుకుంది. మొహం, చేతులకు గాయాలైన బాధితులను చికిత్స కోసం తాలూకా ఆసుపత్రిలో చేర్పించారు. దాడికి గురైన వారిలో ఒక బాలుడు, మహిళ ఉన్నారు.

దంపతుల మధ్య ఇన్‌స్టాగ్రామ్ రగడ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బిగ్ బాస్ కన్నడ రియాల్టీ షోలో మాజీ పోటీదారు సమీర్ ఆచార్యపై ఆయన భార్య శ్రావణి మహిళా పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. శ్రావణి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టే అంశంలో దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. దంపతులు ఇద్దరినీ మహిళా ఠాణాకు పిలిపించిన పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇప్పించి పంపించారు.

సీఐపై కేసు నమోదు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ హితేంద్రపై జేపీనగర ఠాణాలో కేసు నమోదైంది. గతంలో జేపీ నగర ఠాణాలో ఆయన పని చేస్తున్నప్పుడు నిందితుల నుంచి జప్తు చేసుకున్న చోరీ సొత్తును ఖజానాకు అప్పగించలేదన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. దీనిపై ఎన్నిసార్లు సూచించినా, స్పందించకపోవడంతో అధికారుల సూచనలతో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

విధి ఆడిన ఆటలో.. ఒకరి జననం, మరొకరి మరణం

పావగడ, న్యూస్‌టుడే : ఒకే కుటుంబంలో ఒకరు జన్మించి, ఒకరు మరణిస్తే ఎలా ఉంటుందో ఊహకందదు. అలాంటి సంఘటన పట్టణంలో మంగళవారం జరిగింది. పట్టణంలోని కాళిదాస నగరానికి చెందిన మడివాళ మూర్తి, భూదేవి కుమారుడు అభిషేక్ (26) ఏడాది క్రితం పట్టణానికి చెందిన ముస్లిం సముదాయానికి చెందిన రజియాభానును ప్రేమించి పెళ్ళిచేసుకొన్నాడు. ఆమె గర్భవతి కావడంతో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించగా.. అక్కడ వైద్యులు మంగళవారం శస్త్రచికిత్స ద్వారా కాన్పు చేస్తామని తెలిపారు. అభిషేక్ అక్కడి నుంచి రజియాభాను ఇంటికి వెళ్ళి రాత్రి భోజనం చేసుకొని తన ఇంటికి వచ్చి.. ఇక్కడే పడుకుంటానని మిద్దిమీద నిద్రిస్తున్న తల్లిదండ్రులతో చెప్పాడు. అర్ధరాత్రి నీళ్ళు తాగడానికని కిందకు వచ్చిన తల్లిదండ్రులకు అభిషేక్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని విగత జీవిగా కనిపించాడు. వారు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మంగళవారం ఉదయం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విచిత్రమేమిటంటే అదే సమయానికి మృతుడి భార్య రజియాభాను ఆసుపత్రిలో ఒక బాబుకు జన్మనిచ్చింది. కుటుంబ సభ్యులకు మన కుటుంబంలోకి ఒకడు వచ్చాడని సంతోషపడాలో, మాతో గడిపిన కుమారుడు మా నుంచీ దూరమై పోయాడని బాధ పడాలో దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. మనుషులను విధి ఎంత విచిత్రంగా ఆడిస్తుందో ననడానికి ఇది ఓ ఉదాహరణ. పోలీసులు అభిషేక్ మృతిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అభిషేక్

వీధికుక్క దాడిలో గాయపడిన బాలుడు

బెంగళూరు (గ్రామీణం) : కొప్పళలోని కనపేటలో వీధికుక్క దాడిలో ఐదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. గత రెండు రోజుల్లో కనపేటలో వీధికుక్క ఆరుగురిపై దాడి చేసింది. నగర సభ సిబ్బంది నిర్లక్ష్యంతోనే వీధి కుక్కల సంఖ్య పెరిగిపోతుందని స్థానికులు ఆరోపించారు.

ఒంటరి మహిళపై దాడికి యత్నం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మారతహళ్లి వంతెన సమీపంలోని సర్వీసు రోడ్డులో కారులో ఒంటరిగా ఉన్న మహిళపై ఒక అపరిచితుడు దాడికి యత్నించాడు. తన చరవాణి కెమెరాలో రికార్డు చేయడాన్ని గుర్తించిన ఆగంతకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కర్ణాటక పోలీసుల ఎక్స్‌కార్ప్ ఖాతాలో ఆమె పోస్టు చేసింది. దాన్ని ఫిర్యాదుగా స్వీకరించిన మారతహళ్లి ఠాణా పోలీసులు నిందితుని కోసం గాలింపు చేపట్టారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడి విషాదాంతం

కోలారు, న్యూస్‌టుడే : కోలారు తాలూకా జంగాలహళ్లి సమీపంలోని అరళి గ్రామ శ్మశానవాటికలో పితృపక్షానికి పూజలు చేస్తున్న ఆరుగురు సభ్యులు ఉన్న ఒక కుటుంబంపై తేనెటీగలు దాడి చేశాయి. తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకటస్వామి (60) అనే వ్యక్తి మరణించారు. తీవ్రంగా గాయపడిన శామణ్ణ, సుందరరాజ్, కార్తిక్, శ్రీనివాస్, వెంకటరిగియప్పలను చికిత్స కోసం జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. కోలారు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

గాంధీ పోరాటంపై అవగాహనకు పాదయాత్ర

రాయచూరు, న్యూస్‌టుడే : గాంధీ నేతృత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటం గురించి నేటి తరానికి అవగాహన కల్పించేందుకు బుధవారం ఉదయం జిల్లా క్రీడా మైదానంలోని బాపు విగ్రహం నుంచి వీరశైవ కల్యాణ మంటపం వరకు పాదయాత్ర చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరేగౌడ హంచినాళ్ వెల్లడించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ వివిధ భాగాల అధ్యక్షులు పాదయాత్రలో పాల్గొంటారని వివరించారు. బెంగళూరులోని కేపీసీసీ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని వీక్షించేందుకు కల్యాణమంటపంలో ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాదయాత్రలో కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జమాతే మహిళల జాగృతి ర్యాలీ



పట్టణంలో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేస్తున్న మహిళలు

సింధనూరు, న్యూస్‌టుడే : నైతికతే స్వాతంత్ర్యం పేరిట నెల రోజుల అభియాన్ నిర్వహించిన సింధనూరు జమాతే మహిళా విభాగం చివరి రోజున మంగళవారం జన జాగృతి ర్యాలీ జరిపింది. భర్త మద్యానికి బానిసైతే భార్య, పిల్లలకు పస్తులే అనే నినాదంతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముస్లిం మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. షాదీ మహల్ నుంచి ఇందిరాగాంధీ సర్కిల్ శక్తి భవన్ వరకు ర్యాలీ సాగింది. అక్కడే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వక్తలు 'స్వాతంత్ర్యం మనకు ఇచ్చింది ఇందుకేనా' అనే అంశంపై చర్చించారు.

సిద్ధు రాయచూరు జిల్లా పర్యటన ఖరారు



దీపకాంతులతో సింధనూరు రహదారులన్నీ మిరిమిట్లు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు దసరా పేరిట తొమ్మిది రోజుల వేడుకలను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రాయచూరు జిల్లా పర్యటన ఖరారైంది. ఈ మేరకు అధికార యంత్రాంగానికి అధికారిక టీపీ అందింది. 3న దసరా ఉత్సవాలు ప్రారంభించే సీఎం సిద్ధరామయ్య నాలుగున ఉదయం మైసూరు నుంచి నేరుగా ఎంఎస్‌పీఎల్ వారి ఎయిర్ స్ట్రిప్‌లో కొప్పళ సామీపంలోని గిణిగేరలో దిగుతారు. అక్కడ నుంచి రహదారి మీదుగా 12.15 గంటలకు సింధనూరు చేరుకుంటారు. ఆ రోజు రాత్రి తొమ్మిది గంటల వరకూ సీఎం సింధనూరులోనే ఉండి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. తొలుత సింధనూరు దసరా ఉత్సవాలకు తెర లేపుతారు. అనంతరం పదేళ్లు పూర్తయిన సందర్భంగా 'కల్యాణ కర్ణాటక నడె' ప్రారంభిస్తారు. ఆపై రాయచూరు జిల్లా ఉద్యోగుల నుంచి గౌరవ సమర్పణ స్వీకరిస్తారు. అనంతరం రూ.1635 కోట్ల భారీ మొత్తంతో సింధనూరు-కల్లూర జంక్షన్ (రాయచూరు) వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి, గొరెబాళ్‌క్యాంపు నుంచి గాంధీనగర్ వరకు గల గ్రామీణ రహదారి నిర్మాణాలకు సీఎం సింధనూరు పీడబ్ల్యూడీ క్యాంపులో భూమిపూజలు చేస్తారు. రాత్రి తొమ్మిది గంటలకు సింధనూరు నుంచి రోడ్డు మార్గంగా రాయచూరు పయనమవుతారు. అయిదో తేదీన రాయచూరు, మాన్వి కార్యక్రమాల్లో పాల్గొని అదే రోజు సాయంత్రం అయిదు గంటలకు మళ్లీ సింధనూరు మీదుగానే గిణిగేర వెళ్లి విమానంలో బెంగళూరు బయలుదేరుతారు. ఈ కార్యక్రమాల కోసం సింధనూరు సింగారించుకుంటోంది.

సీఎం పర్యటన వివరాలు

రాయచూరు: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 5వ తేదీ ఉదయం రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆవరణలో కర్ణాటక సంభ్రమ-50, గోకాక్ పోరాట సభను ప్రారంభిస్తారు. ఇక్కడ పర్యటన ముగించుకుని మాన్వికి వెళ్తారు. ఆ తాలూకాలో వివిధ ప్రగతి పనులను పచ్చజెండా ఊపుతారు. కొత్త పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5 గంటలకు మాన్వి నుంచి రహదారి మార్గంలో గిణిగేరా ఎయిర్‌స్ట్రిప్‌కు పయనమవుతారు.

వైద్యరంగంలో మార్పులపై అధ్యయనం



స్నాతకోత్సవంలో పాల్గొన్న మంత్రి బోసురాజు, ప్రముఖులు

రాయచూరు, న్యూస్‌టుడే : వైద్యం ఖరీదైనందున పేదలకు సరసమైన ధరలకు దంత పరీక్షలు, చికిత్సలు చేసేందుకు ఆసుపత్రులు, వైద్యులు ముందుకు రావాలని చిన్న నీటిపారుదల, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి బోసురాజు కోరారు. మంగళవారం రాయచూరులోని ఏఎంఇ దంత వైద్య విద్యాలయంలో స్నాతకోత్సవం జరిగింది. డెంటల్ డిగ్రీ, పీజీ చేసిన విద్యార్థులకు మంత్రి పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసిన వారు అనుభవం గడిస్తేనే వైద్యులుగా రాణిస్తారన్నారు. ఇందుకు శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వైద్య రంగంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయాలని, తద్వారా మెరుగైన వైద్యం అందించడం సాధ్యపడుతుందని తెలిపారు. యువ వైద్యులు గుంపు చర్చలు చేయాలని, దీని వల్ల కొత్త విషయాలపై అవగాహన ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. వైద్య నిపుణులు వారానికి ఒకసారి పేద బస్తీలు, పల్లెల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలు చేయాలని మంత్రి కోరారు. మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి మాట్లాడుతూ ఈ వైద్య కళాశాలలో చదివిన విద్యార్థులు రాష్ట్ర, దేశ స్థాయిలో వైద్య నిపుణులుగా రాణిస్తుండడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు విఠోబా, కార్యదర్శి దరూరు బసవరాజ పాటిల్, ప్రిన్సిపల్ డాక్టర్ శివానంద, భీమనగౌడ పాటిల్, గంగాధర ఎలి వేదికను అలంకరించారు.

4 నుంచి రాజధానిలో ఆందోళన



గోడపత్రాలు విడుదల చేస్తున్న సంఘం ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4 నుంచి బెంగళూరులోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో నిరవధిక ఆందోళన ప్రారంభిస్తామని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అణ్ణారావ్ వెల్లడించారు. ఆయన మంగళవారం పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధి అధికారికి గెజిటెడ్ గ్రూప్-బీ శ్రేణి ఇవ్వాలని, గ్రేడ్-1 ఉద్యోగికి పీడీవోగా పదోన్నతి కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయాలన్నారు. ప్రతి పంచాయతీకి ద్వితీయ శ్రేణి అకౌంటెంట్ పోస్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ మాదిరి పంచాయతీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులకు గౌరవ వేతనం చెల్లించాలని, బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తెస్తామన్నారు. పంచాయతీని ఒక యూనిట్‌గా పరిగణించాలని, ఒకే చోట ఐదేళ్లు పనిచేసేలా నియమాలను మార్చాలన్నారు. ఈ సందర్భంగా ధర్నా గోడ పత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు తాయణ్ణ, భీమరెడ్డి, రేఖా, రవి, లక్ష్మిరెడ్డి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దల మార్గదర్శకత్వంలో నడవాలి



జ్యోతి ప్రజ్వలనలో ప్రముఖులు

రాయచూరు, న్యూస్‌టుడే : పెద్దలను గౌరవిస్తూ వారి మార్గదర్శకంలో కుటుంబాన్ని నడపాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శరణమ్మ కోరారు. జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం కన్నడభవన్‌లో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. శరణమ్మ ప్రారంభ జ్యోతిని వెలిగించి మాట్లాడారు. ఇంటి యజమాని చెప్పినట్లు నడుచుకుంటున్నందునే గతంలో కుటుంబాల్లో కలహాలు కనిపించేవి కావన్నారు. ఇప్పుడు వయసు మీద పడిన వారిని నిర్లక్ష్యం చేయడం, కొందరు వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్నందున సమస్యలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు తమ సమస్యల పరిష్కారం కోసం సహాయవాణిని సంప్రదించాలని సూచించారు. నాగరికుల సురక్షా సంస్థ అధ్యక్షుడు పవన్ పాటిల్ మాట్లాడుతూ వృద్ధుల పింఛన్ మొత్తాన్ని పెంచాలని, తాలూకా స్థాయిలో నిరీక్షణా కేంద్రాలను స్థాపించాలని, ఆరోగ్య ఖర్చులను భరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. జిల్లా దివ్యాంగులు, వృద్ధుల సబలీకరణ శాఖ అధికారి శ్రీదేవి, జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు మహదేవమ్మ, పాల్గొన్నారు.

గోకాక్ పోరాట సభను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నితీష్

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆవరణలో ఈ నెల 5న నిర్వహిస్తున్న కలబురగి విభాగ స్థాయి గోకాక్ పోరాట సభను విజయవంతం చేయాలని జిల్లా పాలనాధికారి నితీష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా పంచాయతీ సభాభవన్‌లో వివిధ సంఘాల, సంస్థల ప్రతినిధులతో సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన నితీష్ మాట్లాడుతూ రాయచూరులో జరిగిన అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం మాదిరి జరిగేందుకు కన్నడ అభిమానుల భాగస్వామ్యం అవసరమన్నారు. గోకాక్ పోరును మననం చేసుకునేందుకు జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న సభను అధికసంఖ్యలో జనం తరలివచ్చేలా ప్రేరణ కల్గించాలని కోరారు. ఆ నాటి పోరాట ఘట్టాలను యువత, విద్యార్థులకు తెలియచేయాలన్నారు. గోకాక్ పోరులో పాల్గొన్న జిల్లా పోరాటకారులను సత్కరిస్తామని తెలిపారు. సంఘాలు, సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ సభలో స్థానిక కళాకారులు పాల్గొనేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొనేలా సూచనలు చేయాలని కోరారు. నిర్వహణకు నియమించిన వివిధ సమితులు అందరి సహకారం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. జడ్పీ సీఈవో రాహుల్ తుకారం పాండ్యే, జిల్లా అదనపు పాలనాధికారి శివానంద, తదితరులు పాల్గొన్నారు.

'ఏడీజీపీపై చర్యలు తీసుకోవాలి'



విలేకరులతో మాట్లాడుతున్న నాడగౌడ, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామిని అవమానించేలా మాట్లాడిన లోకాయుక్త ఏడీజీపీ చంద్రశేఖర్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, ఆయన అక్రమంగా సంపాదించిన ఆస్తులపై దర్యాప్తు చేయించాలని దళ్ (ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి వెంకట్రావ్ నాడగౌడ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం పత్రికాభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. యూపీఎస్సీ నియమాలను ఉల్లంఘించిన ఆయనను ఉపేక్షిస్తే సహించబోమన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గంభీరంగా తీసుకోకపోతే రాష్ట్ర స్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. సదరు అధికారి వ్యాఖ్యలను సమర్థించేలా ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడం శోచనీయమన్నారు. ఇతర రాష్ట్ర ఐపీఎస్ కేడర్ అధికారి వేరే రాష్ట్రంలో నాలుగేళ్లు మాత్రమే పని చేయాలని, కానీ చంద్రశేఖర్ పాతికేళ్లుగా ఇక్కడ తిష్ట వేయడం అంతుచిక్కలేదన్నారు. ఇతడి ప్రవర్తన గురించి కేంద్రానికి ఫిర్యాదు చేస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్, నాయకులు బుడ్డనగౌడ, మహంతేశ్ పాటిల్, శివశంకర్, సణ్ణ నరసింహ నాయక్, నరసప్ప ఆశాపూర పాల్గొన్నారు.

కించపరిచే మాటలపై గళమెత్తిన 'దళం'

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని అనుచిత పదజాలంతో దూషించిన ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని జనతా దళ్ డిమాండు చేసింది. దళ్ ప్రధాన కార్యాలయం వద్ద పార్టీ నాయకులు మంగళవారం ధర్నాకు దిగారు. పార్టీ బెంగళూరు నగర శాఖ అధ్యక్షుడు రమేశ్ గౌడ, ఎమ్మెల్సీలు జవరాయిగౌడ, టీఏ శరవణ నేతృత్వంలో కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. అక్కడి నుంచి లోకాయుక్త కార్యాలయం వైపు వెళుతున్న ఆందోళనకారులను అదుపులోనికి తీసుకుని బస్సులోకి ఎక్కించి తరలించారు. కొంత సమయం అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.



జనతాదళ్ కార్యాలయం వద్ద ఆందోళనకారులు

వెంకన్న ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు



మాట్లాడుతున్న అధ్యక్షుడు ఈరణ్ణ, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : స్థానిక ఉప్పారవాడి లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని దేవస్థాన సమితి అధ్యక్షుడు ఈరణ్ణ వెల్లడించారు. ఆయన మంగళవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి రోజూ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తారని, తొమ్మిది రోజులూ రాత్రి ఒక్కో వాహనంపై శ్రీమన్నారాయణుడిని పురవీధుల్లో ఊరేగిస్తామని వివరించారు. నిత్యం ప్రవచనాలు, భజన ఉంటుందని తెలిపారు. భక్తులు పొర్లు దండాలు చేస్తారని వెల్లడించారు. చివరి రోజు శ్రీనివాసుడి కల్యాణోత్సవం, తొట్టెలసేవ చేస్తారని చెప్పారు. ఉత్సవాల ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. నగరంలోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీనివాసుడి కృపా కటాక్షానికి పాత్రులు కోవాలని ఆయన కోరారు. సమావేశంలో అర్చకుడు శాంతాచార్య, సమితి ప్రతినిధులు ఆంజనేయ, గట్టు వెంకటేష్, లక్ష్మీపతి, శ్రీనివాస్, వెంకోబా పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం మౌనవ్రతం



మాట్లాడుతున్న స్వామీజీలు

మాన్వి, న్యూస్‌టుడే : లోక కల్యాణార్థం తాము మౌనవ్రతం చేసినట్లు కల్మఠ విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ వెల్లడించారు. పట్టణంలోని కొండపై భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి దేవస్థానంలో 21 రోజుల పాటు మౌనవ్రతం పాటించినట్లు చెప్పారు. వివిధ మఠాల స్వామీజీల సాన్నిధ్యంలో మంగళవారం దీక్ష విరమించారు. ఈ దీక్ష వల్ల మనిషి ఇంద్రియాలు నిగ్రహంతో ఉంటాయని నీలగల్‌మఠం పంచాక్షరి శివాచార్య స్వామీజీ పేర్కొన్నారు. నిత్యం మనల్ని వెంటాడే కోపం, ఆశలు, చిరాకు నుంచి దూరం కావచ్చునన్నారు. కార్యక్రమంలో అడవి అమరేశ్వర తొంటదార్యస్వామీజీ, అరళహళ్లి శరణబసవ దేవరు, పట్టణ ప్రముఖులు, కల్మఠం భక్తులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆందోళన



కూడలి వద్ద విశ్రాంత ఉద్యోగుల ప్రదర్శన

రాయచూరు, న్యూస్‌టుడే : ఏడో వేతన కమిషన్ సిఫార్సులను విశ్రాంత ఉద్యోగులకు వర్తింప చేయాలని విశ్రాంత ఉద్యోగుల జిల్లా వేదిక ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. ఈ మేరకు మంగళవారం వేదిక ముఖ్యులు హనుమంతప్ప, విశ్వనాథరెడ్డి, భీమణ్ణనాయక్ నాయకత్వంలో టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో ధర్నాకు దిగారు. అంబేడ్కర్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద న్యాయం చేయాలని ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. మధ్యాహ్నం జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. జులై 1, 2022 నుంచి జులై 31, 2024 మధ్య పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కొత్త వేతనాలు ఇవ్వకపోతే ఆర్థికంగా నష్టపోతారన్నారు. 30 ఏళ్లుగా సేవలందించిన ఉద్యోగుల న్యాయ బద్ధమైన కోర్కెను నెరవేర్చాలని కోరారు.

చీపురు పట్టిన తహసీల్దారు

సింధనూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా అభియాన్‌లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం సింధనూరు తహసీల్దారు అరుణ్ దేశాయ్ కళాశాల విద్యార్థినులతో కలసి చీపురు పట్టి మినీ విధానసౌధ ప్రాంగణం శుభ్రం చేసే పనిలో పాలుపంచుకున్నారు. నగరాభివృద్ధి శాఖ పిలుపు మేరకు స్వచ్ఛతా అభియాన్‌లో భాగంగా గాంధీ జయంతికి ఒక రోజు ముందు స్థానిక పాటిల్ మహిళా కళాశాల విద్యార్థినులు మినీ విధానసౌధ వద్ద శ్రమదానం చేపట్టారు. చీపుర్లు, బుట్టలు పట్టుకుని తమ ప్రాంగణంలో చెత్తను ఏరిపారేశారు. సంస్థ కార్యదర్శి ఆర్.సి. పాటిల్ కూడా ఇందులో పాల్గొన్నారు. విషయం తెలుసుకుని తమ కార్యాలయ ఛాంబర్‌లో ఉన్న తహసీల్దారు అరుణ్ వెంటనే అక్కడికి చేరుకుని విద్యార్థులతో కలసి తానూ అభియాన్‌లో పాల్గొన్నారు.

నల్ల కృష్ణమూర్తికి జిల్లా శ్రేష్ట నాగరిక ప్రశస్తి

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా ఈజే.హొసళ్లి క్యాంపునకు చెందిన తెలుగు పెద్ద నల్ల కృష్ణమూర్తిని జిల్లా పాలనా యంత్రాంగం మంగళవారం రాయచూరులో 'జిల్లా శ్రేష్ట నాగరిక' పురస్కారం అందించి సత్కరించింది. పండిత సిద్ధరామ జంబలదిన్ని రంగమందిరంలో జిల్లా నాగరిక సబలీకరణ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఆచరించింది. ఈ కార్యక్రమంలో అధికారులు నల్ల కృష్ణమూర్తికి ప్రశస్తిని అందించారు. హొసళ్లి క్యాంపు వేదికగా కృష్ణమూర్తి తనయుడు నల్ల అశోక్ పాల వ్యాపారంతో పాటు ప్రవృత్తిగా అయిదేళ్ల కిందట అక్షర ఆహార జోళిగె అనే సేవా సంస్థను స్థాపించారు. ఈ సంస్థకు నల్ల కృష్ణమూర్తి గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారు. ఎక్కడ ఏ వేడుకలు, పుణ్యకార్యాలు జరిగినా.. అందులో మిగిలిపోయిన ఆహారాన్ని తమ వాహనంలో వెళ్లి తెచ్చుకుని.. నిరుపేదలకు, అన్నార్థులకు వడ్డిస్తుంటారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రశస్తి అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రాజీనామాకు మొండితనమేల?



పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న విజయేంద్ర

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మొండితనాన్ని వీడి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని సిద్ధరామయ్యకు భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర హితవు పలికారు. తన నేరం నుంచి తప్పించుకునేందుకు మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) నుంచి తీసుకున్న 14 ఇంటి స్థలాలను వెనక్కు ఇచ్చేస్తే చేసిన నేరం మాఫీ అవుతుందా అని ప్రశ్నించారు. పార్టీ నాయకులతో కలిసి భాజపా ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్'లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముడాలో అక్రమాలను బయటపెట్టి శాసనసభలో ధర్నాకు దిగినప్పుడు, సమావేశాలను మధ్యలోనే వదిలి సీఎం పరారయ్యారని ఎద్దేవా చేశారు. జనతాదళ్‌తో కలిసి బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర చేయడం ద్వారా ప్రజలకు కూడా సిద్ధరామయ్య చట్టాన్ని అతిక్రమించి, ఇళ్ల స్థలాలను పొందారని అర్థమైందని చెప్పారు. ఇళ్ల స్థలాలను వెనక్కు ఇచ్చేసినా కోర్టు, ఈడీ విచారణను ఎదుర్కొనక తప్పదన్నారు. సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర, భార్య పార్వతి ముగ్గురూ విచారణ ఎదుర్కొనడం తప్పనిసరని స్పష్టం చేశారు. ఆయన ఆడుతున్న రాజకీయ నాటకాలను ప్రజలు గుర్తించారని వ్యాఖ్యానించారు.

'ఉపాధ్యాయులు వృత్తి గౌరవాన్ని కాపాడాలి'



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మంత్రి బోసురాజు తదితరులు

సిరివార, (మాన్వి) : సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన స్థానముందని, దాన్ని కాపాడుకోవాలని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను గుర్తించాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలోనే ప్రథమంగా మాన్వి తాలూకా ఉపాధ్యాయులకు బంగారు పతకాలను ఇచ్చి ప్రోత్సహించినట్లు చెప్పారు. ప్రభుత్వం శిక్షణ, ఆరోగ్య రంగాలకు అధికంగా నిధులు కేటాయిస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించామన్నారు. ఐదు వేల మంది ఉపాధ్యాయులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ కర్తవ్యాన్ని నిర్వహించినప్పుడు ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. మంత్రి బోసురాజు నియోజకవర్గానికి పాఠశాలలు, కళాశాలలు, వసతి నిలయాలను మంజూరు చేయించారన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి బంగారు పతకాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి ఎస్ అంగడి, బీఈఓ చంద్రశేఖర్, టీపీఈఓ శశిధర్‌స్వామి, సంగమేష్, అశోక్‌కుమార్, తిమ్మణ్ణ బల్లటిగి, శాంతప్ప తదితరులు పాల్గొన్నారు.

మాన్విలో సీఎం సభావేదిక పరిశీలన

ఈ నెల 5న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాన్వి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పరిశీలించారు. సీఎం బహిరంగ సభకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా పనులు చేయాలని ఆయన సూచించారు. వేదిక నిర్మాణం, ఆసనాలు, పార్కింగ్ స్థలం పరిశీలించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

01-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.95	1617.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8277	1220
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,177	9,791
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.578	55.737

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఉర్దూ తప్పనిసరి ఉత్తర్వులు తగవు

మాన్వి, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల నియామకానికి ఉర్దూ భాష తప్పనిసరిగా వచ్చి ఉండాలన్న నిబంధన సరికాదని, దీన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని హిందూ జనజాగృతి సమితి డిమాండ్ చేసింది. సమితి సభ్యులు మంగళవారం స్థానిక ఉప తహసీల్దార్ వినాయకరావుకు వినతి పత్రం అందించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటప్పుడు ఉర్దూ భాష ఎంపిక చేసుకుంటేనే అప్‌లోడ్ అవుతుందని, ఇతర భాష ఎంపిక చేసినప్పుడు అది సాధ్యపడటంలేదని ఆరోపించారు. కర్ణాటకలో కన్నడ భాష పాలన ఉండగా ఉర్దూ భాషను తప్పనిసరి చేయడమేమిటని ప్రశ్నించారు. వెంకటరమణ నాయక్, నింగప్ప, మంజునాథ్, శ్రీనివాస్, సురేష్‌నాడగౌడ, వేణుగోపాల్, వరప్రసాద్, ఆంజినేయ, దుర్గప్ప, శివయ్యస్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా కటకటాలపాలు

రూ.1.9 కోట్ల ఆభరణాల జప్తు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపిస్తున్న కొత్వాలు దయానంద తదితరులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రుళ్లు దొంగతనాలు చేస్తున్న సన్యాసిమఠ నందీశ్ (25), నందీశ్ (25), ప్రతాప్ కుమార్ (25) అనే నిందితులను అరెస్టు చేసి.. భారీగా నగలు స్వాధీనం చేసుకున్నట్లు సుబ్రహ్మణ్యనగర ఠాణా పోలీసులు మంగళవారం ఇక్కడ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.9 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. జప్తు చేసుకున్న వాటిలో 1.802 కిలోల ఆభరణాలు, 110 గ్రాముల వెండి గొలుసులు, 8 చేతి గడియారాలు, ఒక ఇనుప రాడ్డు, శిరస్త్రాణం ఉన్నట్లు నగర పోలీసు కమిషనర్ దయానంద తెలిపారు. ఆయన మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీ సొత్తును ప్రదర్శించారు. సుబ్రహ్మణ్యనగరలోని ఒక బాధితుని ఫిర్యాదుతో పోలీసులు దాడిచేసి దుండగులను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ధర్మస్థలలో దర్శనం చేసుకుని వస్తున్న ఒక నిందితుడ్ని అనుమానం కొద్దీ శిరా తాలూకా హులియారు వద్ద అరెస్టు చేశారు. అతని నుంచి సేకరించిన సమాచారంతో విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా ఉలువత్తి గ్రామంలో మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసి, చోరీ సొత్తు స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. ఉత్తర విభాగం డీసీపీ సైదులు అడావత్, సుబ్రహ్మణ్యనగర ఠాణా ఇన్‌స్పెక్టర్ హెచ్‌వీ సురేశ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.